నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | మంగళవారం 17-12-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 121 | పేజీలు: 4 | వెల: రూ.1/-

హింసాత్మక ఆందోళనలు దురదృష్టకరం : ప్రధాని మోదీ

హైదరాబాద్, డిసెంబర్ 16: పౌరసత్వ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలపై ప్రధాని మోదీ స్పందించారు. బిల్లును వ్యతిరేకిస్తూ హింసాత్మక నిరసనలు చోటుచేసుకోవడం దురదృష్టకరమన్నారు. ఆ ఆందోళనలు తనను తీవ్రంగా కలిచివేస్తున్నాయని ప్రధాని మోదీ తన ట్విట్టర్‌లో తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రతి అంశాన్ని చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, కానీ ప్రజా సంపదను ధ్వంసం చేయడం సరికాదన్నారు. సాధారణ జనజీవనాన్ని దెబ్బతీయడం పద్ధతి కాదన్నారు. పౌరసత్వ సవరణ బిల్లు ఉభయసభల్లో భారీ మెజారిటీతో ఆమోదం పొందిందని, అనేక రాజకీయ పార్టీలు స్వాగతించాయని, ఎంపీలు కూడా బిల్లుకు ఆమోదం దక్కేలా మద్దతు ఇచ్చారని మోదీ తెలిపారు. విభిన్న సంస్కృతులను స్వాగతించి, సోదర భావాన్ని పెంపొందించే వందలాది ఏళ్ల భారతీయ నైజానికి ఈ చట్టం అద్దంపడుతుందన్నారు.

ఆందోళనకు దిగిన జిల్లా పసుపు రైతులు

ధర్మపురి అర్వింద్‌కు వ్యతిరేకంగా నినాదాలు
కళ్యాపూర్ గ్రామంలో అరవింద్ దిష్టిబొమ్మ దగ్ధం
ర్యాలీకి అనుమతి నిరాకరించిన పోలీసులు

నిజామాబాద్,డిసెంబర్16(ఆర్ఎన్ఎ): నిజామాబాద్ జిల్లాలో పసుపు రైతులు ఆందోళనకు దిగారు. భారతీయ జనతా పార్టీ ఎంపీ ధర్మపురి అరవింద్‌కు వ్యతిరేకంగా పసుపు రైతులు నినాదాలు చేశారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో ఎంపి విఫలమయ్యారని ధ్వజమెత్తారు. కేంద్రంలో అధికారంలో ఉన్నా బోర్డు ఏర్పాటులో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఆందోళనకు దిగారు. రెంజల్ మండలం కళ్యాపూర్ గ్రామంలో అరవింద్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. పసుపు బోర్డు తెస్తానని ఎంపీ అరవింద్ మాట తప్పారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మాట తప్పిన ఎంపీ అరవింద్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని రైతులు డిమాండ్ చేసారు. జగిత్యాలలోనూ పసుపు రైతులు ఆందోళనకు దిగారు. ఎంపీ అరవింద్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికలు జరిగిన ఆరు నెలలు దాటినా కేంద్రం నుంచి కూడా స్పష్టమైన హామీ రాకపోవడంతో రైతు ఐక్య కార్యచరణ కమిటీ విడతలవారీగా పాదయాత్ర చేసేందుకు నిర్ణయించింది. నేటి నుంచి మెండోరా మండలం వెల్గటూరు నుంచి పాదయాత్ర చేపట్టేందుకు చర్యలు చేపట్టింది. పోలీసుల అనుమతిని సంఘం సభ్యులు కోరారు. అనుమతి కోసం దరఖాస్తును చేశారు. పోలీసులు మాత్రం శాంతిభద్రతల సమస్య ఎదురవుతుందని అనుమతి నిరాకరించారు. ఈ మేరకు సంఘం సభ్యుడు అన్వేష్‌రెడ్డికి అనుమతి నిరాకరిస్తున్నట్లు ఆర్మూర్ ఏసీపీ రఘు తెలిపారు. ఒకవేళ పాదయాత్ర చేపడితే అనుమతి లేకపోవడం వల్ల అదుపులోకి తీసుకుంటామని ప్రకటించారు. రైతు ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు మాత్రం పాదయాత్రకే సిద్ధమయ్యారు. పసుపు బోర్డు ఏర్పాటు, మద్దతు ధర డిమాండ్‌తో రైతులు ధర్నాకు దిగారు. పోలీసులు అదుపులోకి తీసుకున్నా కొనసాగిస్తామని రైతు ఐక్య కార్యాచరణ కమిటీ నేత అన్వేష్‌రెడ్డి తెలిపారు. తాము రాజకీయాలకు అతీతంగా రైతుల కోసమే ఈ పాదయాత్ర చేపడుతున్నామని, అడ్డుకోవద్దని కోరారు. బీజేపీ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చలేదని ప్రకటించారు. హామీలో భాగంగా పసుపు బోర్డు ఏర్పాటుచేయాలని కోరారు. ఇదేరీతిలో టీఆర్ఎస్ అనుబంధంగా ఉన్న రైతు నేతలు కూడా వేల్పూరు మండలం లక్కోరాలో సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా పసుపు బోర్డును కేంద్రం ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. ఎంపీ అరవింద్ ఏర్పాటుచేసేందుకు చొరవ చూపాలని కోరారు. తాము పాదయాత్రకు వ్యతిరేకం కాదని ప్రకటించారు. రైతుల ప్రయోజనాలకు పసుపు బోర్డు ఏర్పాటు ఉపయోగపడుతుందని అన్నారు. బోర్డుకు మినహా ఇతర ఏవీ ఏర్పాటుచేసినా ఉపయోగం లేదని ప్రకటించారు. ఎంపీ అరవింద్ మాత్రం కేవలం పసుపు బోర్డుతో లాభం లేదని, పూర్తిస్థాయి స్వయం ప్రతిపత్తి కలిగిన బోర్డుకోసం ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 30 సార్లు కేంద్రమంత్రులతో చర్చలు జరిపి నివేదించామని, సంక్రాంతి వరకు బోర్డు కార్యరూపం దాల్చనుందని ధీమావ్యక్తం చేశారు. రైతులు రాజకీయ ఉచ్చులో పడవద్దని, వారికి ఎవరు మేలు చేస్తారో తెలుసుకోవాలని కోరారు. ఇదిలావుంటే జిల్లాలో రైతు ఐక్య కార్యాచరణ కమిటీ చేపట్టిన పాదయాత్ర రాజకీయ రంగు పులుముకుంటోంది. పసుపుకు మద్దతు ధర, పసుపు బోర్డు ఏర్పాటుకోసం రైతులు నేటి నుంచి చేపట్టిన పాదయాత్రకు పోలీసులు అనుమతి నిరాకరించగా పోటీగా అధికార పార్టీ నేతలు బోర్డు కావాలని మరో ఉద్యమాన్ని మొదలు పెట్టారు. ఎంపీ అరవింద్ టార్గెట్‌గా ఉద్యమం నిర్వహిస్తామని ప్రకటించారు. తమకు బోర్డే కావాలని డిమాండ్ చేశారు. పసుపు రైతులను ఆదుకునేందుకు బోర్డుకన్నా మెరుగైన పద్ధతులను పకడ్బందీగా అమలు చేసేందుకు కేంద్రం కసరత్తులు చేస్తుందని ఎంపీ అరవింద్ ప్రకటించారు. ఎవరికి వారే తమ ఏర్పాట్లలో నిమగ్న మయ్యారు. పసుపు మద్దతు ధర కోసం గత కొన్నేళ్లుగా జిల్లాలోని రైతులు వివిధ సంఘాల పేరుతో ఉద్యమాలు చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కలుస్తూ పసుపు బోర్డు ఏర్పాటు చేయడంతోపాటు మద్దతు ధర కల్పించాలని కోరుతున్నారు. కేంద్ర, రాష్ట్రాల నుంచి సరియైన స్పందన రాకపోవడంతో గత పార్లమెంట్ ఎన్నికల్లో 175 మంది రైతులు పోటీచేశారు. తమ నిరసనను ప్రకటించారు. నేటి నుంచి పాదయాత్ర జరిపేందుకు సిద్ధం అవుతున్నారు. ఆయా గ్రామాల రైతులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా పాదయాత్ర చేసి తీరతామని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గత ఎర్రజొన్నల ఉద్యమాన్ని దృష్టిలో పెట్టుకుని తమవంతుగా రైతుల కోసం ముందుకు వచ్చారు. పసుపు ఉద్యమం మొదలు కాగానే కేంద్ర, రాష్ట్రాల్లో ఉన్న అధికార పార్టీలు కదిలాయి. గత ఎన్నికల్లో రైతులు చేపట్టిన ఉద్యమం ఫలితాలను తారుమారు చేయడంతో ప్రస్తుతం టీఆర్ఎస్, బీజేపీ నేతలు ఎవరికి వారే తమ ప్రయత్నాల్లో ఉన్నారు. రైతు ఐక్యకార్యచరణ కమిటీలో ప్రతిపక్షాలకు చెందిన నేతలతోపాటు రైతులు ఉండటం గతంలో భారీగా ఉద్యమం చేయడం వల్ల రాజకీయంగా తమకు ఇబ్బందులు వస్తాయని ఈ రెండు పార్టీల నేతలు భావిస్తున్నారు. ఎవరికి వారే ప్రకటనలు చేస్తున్నారు. రైతులు మాత్రం తమకు రాజకీలయకు అతీతంగా మద్దతు కల్పించాలని పట్టుపడుతున్నారు. పోలీసులు మాత్రం గత సంవత్సరం ఎర్రజొన్న రైతులు చేపట్టిన ఉద్యమం ఉధృతంగా మారడంతో మళ్లీ అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఉండేందుకు చర్యలు చేపట్టారు. ముందే అనుమతి నిరాకరించారు. మెండోరా ప్రాంతంలో మందస్తు బందోబస్తును ఏర్పాటును చేస్తున్నారు.

నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కళ్యాపూర్ గ్రామంలో ఎంపి అరవింద్ దిష్టిబొమ్మను దగ్ధం చేసిన పసుపు రైతులు.

ఆగని ఆందోళనలు!

న్యూఢిల్లీ, డిసెంబర్16(ఆర్ఎన్ఎ) : పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా చేపట్టిన ఆందోళనలు హింసాత్మకంగా మారుతున్నాయి. అటు ఈశాన్య నుంచి ఇటు దక్షిణాది వరకు నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం ఆందోళనలు ఉధృతమయ్యాయి. పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తున్న వారంతా రోడ్లపైకి వచ్చి తమ నిరసనలు వ్యక్తం చేశారు. కేంద్రం నిర్ణయానికి వ్యతిరేఖంగా సోమవారం పశ్చిమ బెంగాళ్ సీఎం మమతా బెనర్జీ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ప్రభుత్వం తీరుపై ఆమె తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రజల మనోభావాలను ప్రభుత్వం విస్మరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికితోడు జామియా మిలియా ఇస్లామియా(జేఎంఐ) విశ్వవిద్యాలయం వద్ద ఉద్రిక్తత వాతావ రణం నెలకొంది. దీంతో పోలీసులు పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఆదివారం ఢిల్లీలో విద్యార్థులు చేపట్టిన నిరసన ప్రదర్శనలు రణరంగాన్ని తలపించాయి. వారిని అదుపు చేయడానికి పోలీసుల లాఠీఛార్జ్ చేసి, కొందర్ని అదుపులోకి తీసుకున్నారు. దీనిపై ఢిల్లీ మైనార్టీ కమిషన్ తీవ్రంగా స్పందించడంతో వారిలో 50మందిని పోలీసులు సోమవారం వేకువజామున విడుదల చేశారు.

ఢిల్లీలో పౌరసత్వ ఆందోళనల సందర్భంగా భారీగా బందోబస్తు ఏర్పాటుకు రంగంలోకి దిగిన బలగాలు

- పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఉధృతమైన ఆందోళనలు
- జేఎంఐ విశ్వవిద్యాలయం వద్ద ఉద్రిక్తత
- పోలీసులు బాత్‌రూంలోకి వచ్చి మరీ కొట్టారు - ఆవేదన వ్యక్తం చేసిన విద్యార్థులు
- పౌరసత్వ సవరణ చట్టాన్ని సవాల్ చేస్తూ సుప్రీంలో వ్యాజ్యాలు
- విచారణకు నిరాకరించిన సుప్రీంకోర్టు
- ముందు ఆందోళనలు విరమించాలని విజ్ఞప్తి
- జామియా, ఎఎంయూ ఘటనపై నేడు విచారిస్తామన్న న్యాయస్థానం
- బెంగాల్‌లో భారీ ర్యాలీ నిర్వహించిన మమత బెనర్జీ - యూపీలో ఇంటర్నెట్ సేవలు నిలిపివేత

ఆడపిల్లల పట్ల విచక్షణారహితంగా వ్యవహరించారు..

కనీసం ఆడపిల్లలని కూడా చూడకుండా పోలీసులు తమను విచక్షణా రహితంగా కొట్టారని ఢిల్లీ జామియా మిలియా విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి జామియా మిలియా ఇస్లామియా(జేఎంఐ) విశ్వవిద్యా లయంలో పోలీసులు తమపై దాడి చేశారంటూ సోమవారం విద్యార్థులు అర్ధనగ్న ప్రదర్శన చేస్తూ ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. మా తోటి విద్యార్థులను దారుణంగా కొట్టారని, బాత్‌రూంలు, లైబ్రరీలోకి పోలీసులు చొరబడి మరీ దాడి చేశారని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ పోలీసులకు వ్యతిరేకంగా మేం నిరసన చేస్తున్నామని విశ్వవిద్యాలయంలోని ఓ రిసెర్చ్ స్కాలర్ ఆవేదన వ్యక్తం చేశారు. మేం యూనివర్సిటీలో ఉన్న సమయంలో పోలీసులు లోపలికి వచ్చారు. సుమారు 20మంది పోలీసులు గేట్ నెంబరు 7ద్వారా లోపలికి రాగా.. మరో 50 మంది పోలీసులు మెయిన్ గేట్ నుంచి వచ్చారని, మేం ఎటువంటి ఆందోళన చేయడం లేదని వాళ్లకి చెప్పినా వినిపించుకోలేదని వాపోయారు. మహిళలని కూడా చూడకుండా విచక్షణారహితంగా కొట్టారని తీవ్రంగా గాయపడిన ఖంజాలా అనే విద్యార్థి చెప్పుకొస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. యూనివర్సిటీలో పరిస్థితులు ఆందోళనకరంగా మారడటంతో కొందరు విద్యార్థులు తమ ఇళ్లకు వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

ముందు ఆందోళనలు విరమించండి - సుప్రీంకోర్టు

పౌరసత్వ సవరణ చట్టాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పలు వ్యాజ్యాలు దాఖలయ్యాయి. అసోంలో బీజేపీ మిత్రపక్షం అసోం గణపరిషత్ సైతం యూటర్న్ తీసుకుని, సుప్రీంలో పిటిషన్ దాఖలు చేయడానికి సిద్ధమైంది. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను అత్యవసరంగా విచారించడానికి సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. రిజిస్ట్రీ ద్వారా కోర్టును సంప్రదించాలని దీనిపై మంగళవారం విచారణ చేపడతామని స్పష్టం చేసింది. అంతేకాదు, పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన శాంతియుత నిరసన హింసాత్మకంగా మారిన అంశంపై విచారణకు అంగీకరించింది. సీఏఏకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న ఢిల్లీ, అలీగఢ్ వర్సిటీ విద్యార్థుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై కూడా విచారణ చేపడతామని స్పష్టం చేసింది. అంతకు ముందు జామియా మిల్లియా ఇస్లామియా, అలీగఢ్ ఘటనలపై సుప్రీంకోర్టుకు సీనియర్ న్యాయవాది ఇందిరా జైసింగ్ వివరించారు. చీఫ్ జస్టిస్ ఎస్ఏ బాబ్డే నేతృత్వంలోని ధర్మాసనానికి వివరించిన ఇందిరా జైసింగ్.. ఈ అంశాన్ని సుమోటాగా తీసుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా మానవ హక్కుల ఉల్లంఘనకు కారణమైన ఈ అంశంపై నిర్ణయం తీసుకోవాలని అన్నారు. పౌరసత్వ చట్టంపై జరుగుతున్న హింస గురించి తెలుసుకోవాని న్యాయవాదులు కోరగా, ఇలాంటి బెదిరింపులు పనికిరావని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అంతేకాదు, తాము హక్కులను నిర్ణయిస్తాము కానీ, హింసాత్మక వాతావరణంలో కాదు.. వీటిని ఆపిన తర్వాత సుమోటాగా స్వీకరిస్తామని, హక్కులు, శాంతియుత ప్రదర్శనలకు సుప్రీం వ్యతిరేకం కాదని జస్టిస్ బాబ్డే వ్యాఖ్యానించారు. మరోవైపు, జామియా మిల్లియా వర్సిటీ ఘటనపై న్యాయ విచారణకు ఆదేశించాలని కోరుతూ ఢిల్లీ హైకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. పోలీసులు అదుపులోకి తీసుకున్న 52 మంది విద్యార్థులు, లాఠీఛార్జ్‌లో గాయపడినవారికి సరైన వైద్యసాయం అందించాలని, పరిహారం అందజేయాలని కోరారు. కాగా జామియా మిలియా విశ్వవిద్యాలయంలో ఆదివారం రాత్రి జరిగిన ఘర్షణలు చాలా దురదృష్టకరమని ఉపకులపతి నజ్మా అక్తర్ అన్నారు. సోమవారం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 'యూనివర్సిటీలో చాలా ఆస్తి నష్టం జరిగిందని, వీటికి ఎవరు బాధ్యత వహిస్తారన్నారు. నిన్నటి ఘటన విషయంపై పోలీసులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతున్నామని, ఉన్నత స్థాయి విచారణ జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ఇద్దరు విద్యార్థులు మరణించినట్లు వార్తలు వస్తున్నాయని, నిన్నటి ఘటనలో విద్యార్థులెవరూ చనిపోలేదని ఆమె స్పష్టం చేశారు. వదంతులు నమ్మొద్దని, సుమారు 200 మందికిపైగా విద్యార్థులు గాయపడ్డారని, మా విద్యార్థులు అయితే మేం వారిని అదుపు చేస్తామని, బయటి వ్యక్తుల ఆందోళనలను అదుపు చేయడం మా విధి కాదన్నారు. ఈ ఘటనపై కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రికి ఫిర్యాదు చేస్తామని, బయట వ్యక్తులెవరూ వర్సిటీకి రావొద్దని ఆమె విజ్ఞప్తి చేశారు.

యూపీలో ఇంటర్నెట్ సేవలు నిలిపివేత..

వివాదాస్పద పౌరసత్వ సవరణ బిల్లుపై ఈశాన్య రాష్ట్రాల్లో మొదలైనన నిరసనలు క్రమంగా దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నాయి. ఆదివారం ఢిల్లీలోని జామియా మిలియా యూనివర్సిటీ రణరంగాన్ని తలపించగా... ఉత్తర ప్రదేశ్‌లో కూడా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఢిల్లీలో పోలీసులు, ఆందోళన కారుల మధ్య తీవ్ర ఘర్షణలు చోటుచేసుకున్న నేపథ్యంలో సహారన్పూర్ జిల్లాల్లో ఆదివారం అర్ధరాత్రి నుంచి ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారు. శాంతి భద్రతల విఘాతం కలగకుండ ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నామని అధికారులు వెల్లడించారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఇంటర్నెట్ సేవలు అందుబాటులో ఉండవని జిల్లా మేజిస్ట్రేఅలోక్ పాండే తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో శాంతి భద్రతలను అదుపులో ఉంచేందుకు సహారన్పూర్ జిల్లా మేజిస్ట్రేట్ సెక్షన్ 144 కింద తన అధికారాలను ఉపయోగించి మొబైల్ ఆపరేటర్లు అందించే ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఇది అమల్లో ఉంటుందఅని సదరు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పుకార్లు, తప్పుడు వార్తలు వ్యాపించకుండా నిలువరించేందుకు ఇంటర్నెట్ సేవలను నిలిపివేస్తున్నట్టు అధికారులు వెల్లడించారు.

మమత భారీ ర్యాలీ.. గవర్నర్ ఆగ్రహం..

పౌరసత్వ సవరణ చట్టాన్ని(సీఏఏ) వ్యతిరేకిస్తూ సోమవారం పశ్చిమ బంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కోల్‌కత్తాలో భారీ ర్యాలీ నిర్వహించారు. రెడ్ రోడ్‌లోని బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం నుంచి ప్రారంభమయ్యే ఈ ర్యాలీ జోరాసంకో థాకుర్బరి వద్ద ముగిసింది. ఈ ర్యాలీలో రాష్ట్ర మంత్రులు, తృణమూల్ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు భారీగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాపమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీరుపై ఆమె తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రజా మనోభావాలకు వ్యతిరేకంగా కేంద్రం వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ఇబ్బందులను తొలగించాల్సింది పోయి వారికి సమస్యలు సృష్టించేలా ప్రభుత్వం వ్యవహరిస్తుందని, ప్రజలంతా ఏకమై బీజేపీకి గుణపాఠం చెప్పాలని ఆమె పిలుపునిచ్చారు. ఇదిలాఉంటే మమత ర్యాలీపై ఆ రాష్ట్ర గవర్నర్ జగ్దీప్ ధనకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత మూడు రోజులుగా నిరసనలతో అట్టుడుకుతున్న రాష్ట్రంలో పరిస్థితులను అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించాల్సిన ముఖ్యమంత్రే సీఏఏకి వ్యతిరేకంగా నిరసన చేపట్టడాన్ని ఆయన తప్పుబట్టారు. సీఏఏకి వ్యతిరేకంగా సీఎం, మంత్రులు ర్యాలీ చేపడతాననడం బాధాకారమని, ఇది రాజ్యాంగ విరుద్ధమని అన్నారు.

హింసాత్మక ఘటనలు దురదృష్టకరం

పౌరసత్వ చట్టంపై విపక్షాల తీరు సరికాదు
ఆందోళనలపై స్పందించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ,డిసెంబర్16(ఆర్ఎన్ఎ): ఢిల్లీలో జరిగిన హింసాత్మక ఘటనలను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డి ఖండించారు. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలపై ఆయన స్పందించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీలో జరిగిన ఘటన దురదృష్టకరమన్నారు. ఇలాంటి హింసాత్మక ఘటనలకు ఏ రాజకీయ పార్టీ మద్దతివ్వదని.. కానీ.. నిరసనకారులకు మద్దతు తెలిపేలా ఓ సీఎం మాట్లాడుతున్నారని ఆరోపించారు. హింసాత్మక కార్యక్రమాలకు పాల్పడ్డారని, బస్సులు, ప్రైవేటు ప్రాపర్టీస్, పబ్లిక్ ప్రాపర్టీస్‌లను ధ్వంసం చేసే ప్రయత్నం చేశారన్నారు. శాంతియుతమైన పద్ధతుల్లో తమ అభిప్రాయాలు వ్యక్తం చేసే హక్కు ఎవరికైనా ఉందని..అయితే..హింసకు తావు లేదన్నారు. హింసకు పాల్పడి..ప్రజలకు ఇబ్బందులు కలిగి విధంగా..ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసే హక్కు ఎవరికీ లేదన్నారు. ఓవైపు మహాత్మా గాంధీ 150వ జయంతి ఉత్సవాలను నిర్వహించకుంటున్నామని, అహింస పద్ధతుల్లో ఆలోచన ఉంటే కొన్ని రాజకీయ పార్టీలు ఈరకమైన హింసాత్మక కార్యక్రమాలను ప్రోత్సాహించడం ఖండించే విషయమన్నారు. పౌరసత్వ బిల్లు ముస్లింలకు వ్యతిరేకం కాదని విద్యార్థులు అర్థం చేసుకోవాలని, హోం మంత్రి స్వయంగా ఈ విషయాన్ని పార్లమెంట్‌లో చెప్పారని గుర్తు చేశారు. శాంతియుతమైన పద్ధతిలో అభిప్రాయాలు వ్యక్తం చేసే హక్కు ఎవరికైనా ఉందని అన్నారు. అయితే, కొందరు బస్సులను, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేసే ప్రయత్నం చేశారని తెలిపారు. హింసాత్మక ఘటనలకు పాల్పడి ప్రజలను ఇబ్బందులకు గురి చేసే హక్కు ఎవరికీ లేదని అన్నారు. జేఎంఐ, అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీల్లో హింసాత్మక ఘటనలు చోటు చేసుకుంటున్న విషయం తెలిసిందే. ఈ రోజు కూడా విద్యార్థులు ఆందోళనల్లో పాల్గొన్నారు.

విద్యార్థుల నిరసనలపై రెండు కేసులు

పౌరసత్వ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ఆదివారం ఢిల్లీలోని జామియా నగర్‌లో విద్యార్థులు నిరసన వ్యక్తం చేసిన విషయం విదితమే. ఆస్తులు ధ్వంసం, అల్లర్లకు సంబంధించి పోలీసులు వేర్వేరుగా రెండు కేసులు నమోదు చేశారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా విచారణ చేపడుతామని పోలీసులు తెలిపారు. జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీ విద్యార్థులు చేపట్టిన నిరసన నిప్పును రాజేసింది. కాల్పులు, అల్లర్లు, ప్రభుత్వ ఆస్తులకు నష్టం, ప్రభుత్వ వనులకు ఆటంకం కలిగించినందుకు న్యూ ఫ్రెండ్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో మొదటి కేసు నమోదైంది. అల్లర్లు, రాళ్ళు రువ్వడం, ప్రభుత్వ పనులకు ఆటంకం కలిగించి నందుకు జామియా నగర్ పోలీస్ స్టేషన్‌లో రెండవ కేసు నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు.

యూనివర్సిటీలో యుద్ధ వాతావరణం నెలకొనడంతో ఇక్కడ ఉండడం సరికాదని భావించిన విద్యార్థులు తమ స్వస్థలాలకు తరలివెళ్తున్నారు. హాస్టళ్లను ఖాళీ చేస్తున్నారు విద్యార్థులు. నిన్న నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా జనవరి 5వ తేదీ వరకు యూనివర్సిటీకి సెలవులు ప్రకటించారు. ఈ మధ్య జరగాల్సిన అన్ని పరీక్షలను యూనివర్సిటీ అధికారులు వాయిదా వేశారు.

చెన్నమనేని వారసత్వంపై స్టే పొడిగింపు

హైదరాబాద్,డిసెంబర్16(ఆర్ఎన్ఎ): వేములవాడ టీఆర్ఎస్ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబు పౌరసత్వ రద్దుపై హైకోర్టులో ఇవాళ విచారణ జరిగింది. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులపై మరో 8 వారాలు స్టే పొడిగించింది హైకోర్టు. ఎమ్మెల్యే రమేశ్ జర్మనీ పౌరసత్వం వదులుకున్నారో లేదో తెలుపాలని కేంద్రాన్ని హైకోర్టు ఆదేశించింది. రమేశ్ పౌరసత్వంపై తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

చెన్నమనేని రమేశ్‌కు జర్మనీ, భారతీయ పౌరసత్వం ఉందని పిటిషనర్ కోర్టుకు తెలిపారు. జర్మనీ పౌరసత్వం రద్దు చేసుకున్నాడని రమేశ్ బాబు తరపు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. రెండు పౌరసత్వాలకు సంబంధించిన ఆధారాలు చూపించాలని పిటిషనర్‌ను హైకోర్టు ప్రశ్నించింది. పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని పిటిషనర్‌ను కోర్టు ఆదేశించింది.

విజయదివస్ అమరులకు ప్రధాని నివాళి

న్యూఢిల్లీ,డిసెంబర్16(ఆర్ఎన్ఎ): విజయ్ దివస్ సందర్భంగా అమర జవాన్లకు ప్రధాని మోదీ నివాళులర్పించారు. భారత సైనికుల ధైర్యం, శౌర్యానికి నివాళులర్పిస్తున్నాని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. 1971 నాటి యుద్ధంలో భారత్ విజయాన్ని సువర్ణాక్షరాలతో లిఖించాలి అని మోదీ పేర్కొన్నారు. ఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారకం వద్ద రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నివాళులర్పించారు. జాతీయ స్మారకం వద్ద త్రివిధ దళాలు నివాళులర్పించాయి. ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్, ఇండియన్ ఎయిర్ ఫోర్స్ చీఫ్ ఆర్కేఎస్ బహదురియా, నేవీ చీఫ్ అడ్మైరల్ కరంబీర్ సింగ్ నివాళులర్పించారు.

లారీని ఢీకొన్న డిసిఎం: డ్రైవర్,క్లీనర్ మృతి

హైదరాబాద్,డిసెంబర్16(ఆర్ఎన్ఎ): ఆగి ఉన్న లారీని డిసిఎం ఢీకొట్టిన సంఘటనలో ఇద్దరు మృతి చెందారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెంట్ మండలం కోహెడ వద్ద సోమవారం ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ ప్రమాదంలో డిసిఎం డ్రైవర్, క్లీనర్ ఘటనా స్థలంలో మృతి చెందారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతులు మల్లికార్జున, మహేశ్‌గా గుర్తించారు. మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

జార్ఖండ్‌లో నాలుగో విడతకు భారీ బందోబస్తు

రాంచీ,డిసెంబర్16(ఆర్ఎన్ఎ): జార్ఖండ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి నాలుగో విడత పోలింగ్ సోమవారం ఉదయం ప్రారంభమైంది. 15 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరుగుతుంది. మొత్తం 221 మంది అభ్యర్థులు ఈ నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థులుగా బరిలో ఉన్నారు. సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుంది. జమువా, బగోదర్, గిరిధ్, దుమ్రి, తుండిలో మధ్యాహ్నం వరకు పోలింగ్ జరగనుంది. ఈ మేరకు పోలీసులు గట్టి భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

రేపు జిఎస్టీ మండలి సమావేశం

పన్ను పెంపుపై సర్వత్రా ఉత్కంఠ

న్యూఢిల్లీ,డిసెంబర్16(ఆర్ఎన్ఎ): ఈ నెల 18వ తేదీ బుధవారం జీఎస్టీ మండలి సమావేశం జరుగనున్నది. జీఎస్టీ వసూళ్లు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఈసారి ఆయా వస్తు, సేవలపై పన్నులను పెంచే అవకాశాలున్నాయన్న అంచనాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రాల నుంచి జీఎస్టీ నష్టపరిహారం బకాయిలు చెల్లించాలన్న ఒత్తిడి పెరుగుతుండటం కూడా పన్ను రేట్ల పెంపుపై మోదీ సర్కారు దృష్టిని నిలుపుతున్నది. జీడీపీ క్రమేణా పతనమవుతుండటంతో తగ్గిన ప్రభుత్వ ఆదాయాన్ని జీఎస

ఎవరికీ ఏమీ కాకుండా పోతామనేది నిజం. ..!

నేటినిజం
మంగళవారం 17-12-2019

మనం మన తోటివారు ఒకరు పదవికోసం, మరొకరు కీర్తికోసం పోరాటం,ఒకరినొకరు నిందించుకోవడం, లాంటివి మాత్రమే అనుకుంటే పొరపాటే... నేడు ప్రతిచోట, మనిషికి మనిషికి మధ్య ఏపాటి అవసరం ఉన్నా లేకున్నా మనచుట్టూ రాజకీయాలు పరిభ్రమిస్తూనే వున్నాయి. ముఖ్యంగా నగరంలో అపార్ట్‌మెంట్స్‌లో అయితే పక్కపక్కనే వున్నా ఒకరంటే ఒకరికి పడని పరిస్థితులు నెలకొన్నాయి...ఇక్కడా ప్రెసిడెంట్ పోటీలు, ఓట్లు, గెలుపు ఓటమిల మధ్య కోపతాపాలు, అపార్ట్‌మెంట్స్‌లో మీ పిల్లల వల్ల నిత్యంపోరాటం, లేదా ఎక్కడో పైప్‌విరిగిందనో, మోటర్‌పాడయ్యిందనో,లిఫ్ట్ రిపేర్ అనో, నిత్యం డబ్బు వసూలు చేయడం, మెయింటేనెన్స్ అంటూ నెలకు వెయ్యిదాకా వసూలుచేయడం, అవీకాకుండా ఏదో పండగలంటూ అని డబ్బులు వసూలుచేయడం, అందులో వచ్చేలాభాలు నువ్వు తిన్నావని, లేదు నువ్వుతిన్నావని, నిత్య పోరాటాలతో రాజకీయాలను మించిపోతున్నాయి.. ఇలా వుండటం వల్ల ఒకరింటి వైపు ఒకరు పలకరించుకోరు. మొక్కుబడిగా నెలకోసారి మీటింగ్ అంటూ కలుస్తారు తప్ప మరేవిధమయిన బాధ్యత తీసుకోరు.

అలాకాకుండా, ఒకరు లేకున్నా మరొకరు ఆ ఇంటికి కాపలా వుంటూ, నేడు జరిగే దొంగతనాలను, మోసాలను అరికట్టవచ్చు. ఇలా ఎవరికి పట్టనట్టు వారుండటంతో ఎవరు ఎందుకు దిగుతున్నారు? వారిలో నమ్మకస్తులు ఎవరు? మోసంతో చేరిన వారు ఎందరని కూడా కనిపెట్టే అవకాశం వుంటుంది.. ఎందుకంటే మనమధ్యే ఒక తీవ్రవాది చేరవచ్చు.. లేదా ఉగ్రవాది వుండవచ్చు. మనలో మనం ఇలా పోట్లాడుకోవడం వారికి చేయాల్సిన పని సులభం అవుతుంది... ఒక్క అపార్ట్‌మెంట్స్‌లోనే కాదు కాలనీల్లో కూడా ఇదే విధమయిన పరిస్థితి నెలకొంటోంది. ప్రతీదీ ప్రభుత్వం పట్టించుకోవాలని, మనకేమీ సంబంధంలేదని కూర్చుంటే మనకు మనం ఎవరికీ ఏమీ కాకుండా పోతామనేది నిజం.

ఆయాసరంధిత అధికారులు మనతోనే వుండాలనుకోవడం పొరపాటు. ఎందుకంటే మనలోనే శత్రువున్నాడు... మనమధ్యలోనే ప్రమాదం పొంచివుంటోంది. ఇవేవీ గమనించుకోకుండా మనకు కావాల్సిన కీర్తికోసమో, సంపాదనకోసమో, నిత్యం ప్రయత్నిస్తూ, ఒకరిపై నిందవేయడమో, ఒకరిని తూలనాడటంలోనో మన జీవితాన్ని వెచ్చించడంవలన అవకాశం కోసం చూస్తున్న శత్రువు బలవంతుడవుతాడు. తద్వారా ఉనికి కోల్పోయే ప్రమాదం ఉంది. కలసివుంటే కలదుసుఖం అనేది ఒకప్పటి మాట. నేడు కలసివుంటేనే బతకవచ్చనేది నేటి మాట.. దాన్ని మనం నిత్యం అవలంబించాలి.ఏ నిముషంలో ఏ ప్రమాదం వస్తుందో, ఏక్షణం ఏ అవాంతరం ముంచుకొస్తుందో, అని నిత్యం భయపడుతున్న వాతావరణంలో మనలో మనం ప్రతినిత్యం అప్రమత్తతతో వుండాలి. ఒక వ్యక్తి ఎంత గొప్పవాడైనా, ఎంత గొప్ప అధికారి అయినా, కోటీశ్వరుడైనా ఒకనాడు తనువు చాలించాల్సిందే...వేలకొలది ఎకరాల భూమి కొనుక్కున్నా, భూమి వున్నంతకాలం మనం వుండమే సంగతి గుర్తించాలి... ప్రస్తుతం మనల్ని మనమే కాపాడుకోవాలి. ఎక్కడో బాంబుబ్లాస్ట్ అయితేనో, అరాచకాలు జరిగితోనో, ప్రతిపక్షాల కుట్రని పాలకవర్గం, పాలకవర్గం అసమర్థత అని ప్రతిపక్షం, ప్రభుత్వ వైఫల్యం అని ప్రజలు అనుకోవడం సమయం వృధా తప్ప, మనల్ని ఎవరూ కాపాడరు.. నిత్యం రోడ్డుపైన బస్సుకోసమో, ఆటోకోసమో, జనం రద్దీగా వున్న ప్రాంతాల్లో మనమే వుంటాం... మన ఇంట్లో మనమే ఒంటరిగానూ ఉంటాం. కనుక మనస్థితిని మనమే గుర్తించుకోవాలి. మనలో మనం కలిసి మెలసి ఒకరినొకరు సాయం చేసుకునే తీరులో కాలనీలు, అపార్టుమెంట్స్ వుండాలి. ఒకరినొకరు అర్థం చేసుకుంటూ మనల్ని మనమే కాపాడుకుంటే ఎన్నో ప్రమాదాల నుండి మనం బయటపడవచ్చు! ఆలోచించండి!!

హక్కు పత్రాల కోసం తంటాలు

సకాలంలో అందక గిరిజనుల ఆందోళన

ఖమ్మం,డిసెంబర్16(ఆర్ఎన్ఎ): హక్కుపత్రాల కోసం ఆదివాసీలంతా ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోక పోవడం దారుణమని, ఇదేనా ఎస్టీలపై చూపే ఆదరణ అని ఆదివాసీ సంక్షేమపరిషత్ నేతలు విమర్శించారు. తరతరాలుగా అడవుల్లో నివసిస్తున్న ఆదివాసీలకు దానిపైన హక్కులను కల్పించేందుకు అటవీహక్కుల చట్టం-2006 చేశారు. దీన్ని 2008 నుంచి అమలు చేస్తున్నారు. వ్యక్తిగత, సామాజిక హక్కుపత్రాల కింద భూములను లబ్ధిదారులను గుర్తించి పట్టాలు జారీచేశారు. సర్వే చేసి పట్టాలు రావాల్సిన వారు 10వేల మందికి పైగానే ఉంటారని ఆదివాసీ సంఘాలనేతలు చెబుతున్నారు. హక్కు పత్రాలు అందుకున్న వారి పేర్లను రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతోంది. సంబంధీకులకు హక్కుపత్రాలు ఇచ్చినా రికార్డుల్లో పహనీలు ధ్రువీకరించని కారణంగా బ్యాంకు రుణాలు అందని పరిస్థితి నెలకొంది. పంటలు నష్టపోయినప్పుడు కూడా వారికి పరిహారం అందకుండా పోతోంది. దీంతో హక్కుపత్రాలు పొందిన వారిలో సగంమంది రుణాలు అందక పంట సాగుకోసం ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఈవిషయమై పలుమార్లు అధికారులకు వివరించామని, అయినా స్పందించకపోతే ఎలా అన్నారు. సమస్యలను పరిష్కరిస్తామని హామీఇచ్చినా పట్టించుకోలేదన్నారు. ఆదివాసీల సమస్యల పరిష్కరించే ఉద్దేశం ప్రభుత్వానికి కనిపించడంలేదు. ఐటీడీఏ పీవో పాటు ఆర్డీవో, అటవీహక్కుల పత్రాల జారీకి సంబంధించిన విభాగాధికారి పోస్టులను ఇప్పటివరకు భర్తీచేయలేదు. అధికారులు లేక సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో కూడా తెలియడంలేదు. వెంటనే ఆయా ఖాళీపోస్టులను భర్తీచేసి హక్కుపత్రాలు లేనివారికి వాటిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. పత్రాలు ఉన్న ప్రతిఒక్కరికి కంప్యూటర్ పహనీ అందేలా చర్యలు తీసుకుని పంట రుణాలు ఇప్పించాలన్నారు.

తెరాస ప్రభుత్వం గిరిజనుల సంక్షేమాన్ని విస్మరించిందని, గిరిజన గూడేల్లో కనీస సౌకర్యాలు కల్పించని దుస్థితి నెలకొందని సీపీఎం ఎమ్మెల్యే సున్నం రాజయ్య అన్నారు. గిరిజనులు ఏళ్లుగా సాగు చేసుకున్న భూములకు పట్టాలు ఇవ్వలేకపోవడంతో రుణాలు పొందలేని పరిస్థితి ఉందన్నారు. తాగునీరు, మురుగుకాల్వలు వంటి కనీస వసతులు, విద్య, వైద్యం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. అనంతరం గిరిజనులు అందించిన వినతి పత్రాలు స్వీకరించి ముఖ్యమంత్రికి అందజేస్తానని, సమస్యలపై పోరాడుతానని హామీ ఇచ్చారు.

అధునాతనంగా బిసి భవన నిర్మాణం

ఆదిలాబాద్,డిసెంబర్16(ఆర్ఎన్ఎ): బీసీ సంఘ భవనం రాష్ట్రంలోనే మొదటిసారి జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్నారు. రూ.5.5 కోట్లతో నిర్మిస్తున్న భవనం త్వరలోనే అందుబాటులోకి రానున్నది. ఎమ్మెల్యే జోగు రామన్న ప్రత్యేక చొరవతో బీసీ భవనం రూపుదాల్చుకుంటున్నది. భవనం అందుబాటులోకి వస్తే బీసీ కులాల వారికి మేలు చేకూరనున్నది. సమావేశాలు, శుభకార్యాలకు తిప్పలు తప్పనున్నది. వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఇక్కడ శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వారికి అవసరమైన పుస్తకాలతో లైబ్రరీని అందుబాటులోకి తేనున్నారు. భవనం త్వరలోనే అందుబాటులోకి రానున్నది.జిల్లా కేంద్రంలో బీసీ సంఘ భవనం ఏర్పాటుకు చర్యలు వేగవంతమయ్యాయి. పాలిటెక్నిక్ కళాశాల పక్కన భవన కోసం నాలుగు ఎకరాల స్థలాన్ని కేటాయించారు. భవన నిర్మాణం కోసం రూ.5.5 కోట్లు ప్రభుత్వం మంజూరు చేశారు. అధునాత హంగులతో భవనాన్ని నిర్మిస్తున్నారు. సమావేశాలు నిర్వహించడానికి హాలు, వివాహాలు, ఇతర శుభకార్యాలు నిర్వహించడానికి మినీ ఫంక్షన్ హాల్ నిర్మిస్తున్నారు. వివిధ పోటీ పరీక్షలకు అభ్యర్థులకు శిక్షణ ఇవ్వడానికి తరగతి గదులు, లైబ్రరీ, తదితర సౌకర్యలు కల్పిస్తున్నారు.

రాష్ట్రంలో ఆదర్శంగా కేసీఆర్ పథకాలు: కోరం

భద్రాద్రికొత్తగూడెం,డిసెంబర్16(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలు దేశంలో ఎక్కడా లేవని, దేశం అంతా తెలంగాణ వైపు చూస్తోందని జడ్పీ చైర్మన్ కోరం కనకయ్య అన్నారు. రాష్ట్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ చరిత్రలో నిలిచిపోయేలా ప్రభుత్వ పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. ఎన్ని పార్టీలు కలిసినా ప్రజలు సీఎం కేసీఆర్‌కే పట్టం కట్టారని, ప్రజల్లో చిరస్థాయిగా ఉండేలా ప్రజా సేవలకు అంకితమయ్యారన్నారు. ఐదేళ్లలో ఆర్థికమాన్యం ఉన్న రాష్ట్రాన్ని ముందుకు నడిపించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. జిల్లాలో సింగరేణి వెలుగునిచ్చే పరిశ్రమ అని, డీఎంఎఫ్ నిధులతో జిల్లాను అభివృద్ధి చేస్తామని తెలిపారు. జిల్లా అంతా గిరిజన ప్రాంతం కావడం వల్ల పట్టణ ప్రాంతాల్లో 1/70 సమస్య ఉత్పన్నమవుతోందన్నారు. జిల్లా అభివృద్ధికి అందరి సహకారంతో ముందుకు వెళ్తానని చెప్పారు. ప్రతీ గిరిజన ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంతో పాటు పట్టణ ప్రాంతాలను కూడా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని చెప్పారు. సీఎం కేసీఆర్ ఆకాంక్షలకు అనుగుణంగా ప్రతి పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని అన్నారు. గ్రామాల్లో అంతర్గత రహదారుల సమస్యను త్వరలోనే పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. పల్లెలను స్వచ్ఛతకు నిలయంగా తీర్చిదిద్దేందుకు సీఎం కేసీఆర్ అమలు చేసిన 30 రోజుల కార్యాచరణ పనులు సత్ఫలితాలనిచ్చాయని చెప్పారు. రానున్న రోజుల్లో ప్రతి గ్రామానికి మౌళిక వసతులు కల్పించే దిశగా నిధులు మంజూరు చేస్తామన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన విద్యార్థుల సంఖ్య

-సౌకర్యాల కల్పనే కారణమన్న ఎమ్మెల్యే

వరంగల్,డిసెంబర్16(ఆర్ఎన్ఎ): తెలంగాణ పాఠశాల్లలో విద్యార్థుల చేరిక సంఖ్య పెరిగిందని, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలే ఇందుకు కారణమని అసెంబ్లీలో చీఫ్‌విప్ వినయ్ భాస్కర్ అన్నారు. సన్నబియ్యం పథకం ప్రవేశ పెట్టిన తరవాతనే రాష్ట్రవ్యాప్తంగా హాస్టళ్లలో హాజరుశాతం పెరగడంతో పాటు ఎక్కువమంది విద్యకు చేరువవుతున్నారని అన్నారు. 34వేలకు పైగా పాఠశాలల్లో సన్నబియ్యం పథకం అమలవుతున్నట్లు తెలిపారు. సన్నబియ్యం పంపిణీలో అక్రమాలు జరగకుండా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

ఎంతోమంది విద్యార్థులకు ఈ పథకంతో లబ్దిచేకూరుతుందన్నారు. విద్యార్థులకు కడుపు నిండా భోజనం పెట్టాలని సీఎం కేసీఆర్ ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ పథకాన్ని సమర్ధంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వసతిగృహాల్లో లక్షల మందికి సన్నబియ్యం పథకం అమలు చేస్తున్నట్లు చెప్పారు. సన్నబియ్యం పథకం అమల్లోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో చదివే పిల్లల అభివృద్ధి కోసమే సన్నబియ్యం పథకం ప్రవేశపెట్టామని తెలిపారు. బంగారు తెలంగాణలో భాగంగానే హాస్టల్ విద్యార్థులందరికీ సన్నబియ్యంతో అన్నం పెడుతున్నామని చెప్పారు. విద్యార్థులకు సరిపడా భోజనం పెట్టాలని సీఎం కేసీఆర్ ఆదేశించారని తెలిపారు. విద్యార్థులకు కడుపునిండా అన్నం పెట్టేందుకే ఈ పథకం ప్రవేశపెట్టామని స్పష్టం చేశారు. సన్నబియ్యం పథకం అమలుతో పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెరిగిందన్నారు. జూనియర్ కళాశాలల్లో సన్న బియ్యంతో భోజనం పెట్టేందుకు అభ్యంతరం లేదన్నారు.

రెంటికి చెడ్డ బిజెపి నేతలు

హైదరాబాద్, డిసెంబర్ 16:తెలంగాణలో అధికార టిఆర్ఎస్‌కు తామే ప్రత్యామ్నాయమని చెబుతున్న బిజెపి వ్యూహాత్మక తప్పిదాలతో అభాసు పాలవుతోంది. ప్రధానంగా రెండు విషయాల్లో బిజెపి ప్రజల ముందు దోషిగా నిలబడక తప్పదు. ఒకటి మద్యనియంత్రణ కోసం డికె అరుణ చేపట్టిన దీక్ష ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. ఓ సారా కంట్రాక్టర్ భార్యగా ఉన్న అరుణ మద్యనిషేధం దీక్ష చేపట్టడంపై ప్రజలంతా ముక్కున వేసేసుకున్నారు. అలాగే పసుపుబోర్డు ఏర్పాటుపై నిజామాద్ ఎంపి ధర్మపురి అర్వింద్ హామీలు గుప్పించారు. బిజెపి పెద్దలు కూడా దీనిక సై అన్నారు. తీరా ఇప్పుడు పసుపు బోర్డును మించి రైతులకు మేలు కలిగేలా చేస్తామంటూ ఎంపి అర్వింద్ ప్రకటించారు. దీంతో పసుపు రైతులు ఆందోళన చేపట్టారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేని పార్టీగా బిజెపి రైతుల ముందు దోషిగా నిలబడక తప్పదు. కాంగ్రెస్ పార్టీ పాలనా కాలంలో డికె సమర సింహారెడ్డి మంత్రిగా ఉండగా ఆయన సోదరుడు భరతసింహారెడ్డి సారాజుగా వెలుగొందారు. ఎంతగా అంటే గిరిజన తండాల్లో సారా కాచుకునే వారిని నగ్నంగా నిలబెట్టి చితకబాదారు. ఈ కథనాలు రాసిన ఆనాటి ఉదయం విలేకరి రాధాకృష్ణను కిడ్నాప్ చేసి చంపబోయారు. దీనిపై ఆనాటి జర్నలిస్ట్ లోకం ఎలుగెత్తి ఉద్యమించడంతో డికె భరతసింహారెడ్డి తోకముడిచారు. ఆ తరవాత ఆయన ఎమ్మెల్యే కూడా అయ్యారు. ఇదంతా మన కళ్లముందున్న సాక్ష్యం. అలాంటి సారాజుల కుటుంబంలో నుంచి వచ్చిన మాజీమంత్రి డికె అరుణ మద్య నిషేధంకావాంటూ దీక్షలకు దిగడంపై ప్రజలు ముక్కున వేసుకున్నారు. పాలమూరు ప్రజలయితే ఔరా ..అని అనుకున్నారు. సర్కార్ సారా, విదేశీ మద్యాన్ని అమ్ముకుని తెగబలిసిన ఓ మాజీ ఎమ్మెల్యే భార్యగా ఆమె మద్య నిషేధం కోసం దీక్ష చేయడం..దానిని బిజెపి తనదిగా పెట్టుకుని టిఆర్ఎస్ సర్కార్‌నై పోరాడడం సిగ్గుమాలిన చర్య కాక మరోటి కాదు. విచ్చలవిడిగా ప్రజలతో మద్యం తాగించి తెగ సంపాదించిన కుటుంబానికి చెందిన వ్యక్తి మద్యదీక్షకు కూర్చుంటే బిజెపి ఎందుకు అంగీకరించిందన్నది ప్రశ్న. ఈ మాత్రం ఇంగితం లేకుండా బిజెపి నేతలు ఉద్యమాలు చేస్తారా అని తర్కించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ప్రస్తుతం తెలంగాణలో మద్య రాజకీయాలు బరితెగించాయనడానికి ఇంతకన్నా నిదర్శనం అక్కర్లేదనుకుంటా. మద్యనిషేధం అంటూ మద్యం వ్యాపారులు, జర్నలిస్ట్‌ను కిడ్నాప్ చేసి చంపబోయిన వారు, గిరిజనలును నానా హింసలకు గురిచేసిన వారు సభలు పెడుతున్న తీరు విస్మయానికి గురిచేసింది. ఒకప్పుడు సారా ఏరులై పారించిన వారే నేడు మద్యనిషేధం విధించాలంటూ కపట దీక్షలతో నీతిబోధలకు దిగడం ఎంతవరకు సమంజసం. పాలమూరు జిల్లాలో సర్కార్ సారా కాంట్రాక్ట్ తీసుకున్న భరత్‌సింహారెడ్డి అధికారం అడ్డంపెట్టుకొని ఆబ్కారీ శాఖను,పోలీస్ శాఖను అడ్డంగా వాడుకున్నాడు.తరతరాలుగా ఇప్పపువ్వు సారా కాస్తున్న చెంచుల మీద దాడి చేసి వారిని తీవ్ర చిత్రహింసలకు గురి చేశారు. వారిని నగ్నంగా నిలబెట్టి తన పైశాచికాన్ని చాటుకున్నారు. వంశపారం పర్యంగా తండాలలో సారా కాసుకొని తాగుతున్న లంబాడీల మీద నాటుసారా నిషేధం విధించాడు. చెంచులు, లంబాడాలు సారాకాచుకుని తాగే హక్కులేదని హుంకరించి వారిని మద్యం మత్తులో ముంచాడు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సారాజుగా లబ్ద ప్రతిష్టుడైన భరత సంఇహారెడ్డి భార్యగా డికె అరుణ తదనంతర కాలంలో కాంగ్రెస్ వారతస్వ రాజకీయాల్లో ఆరితేరి గత ఎన్నికల్లో ఎన్నికల ముందు బిజెపిలో చేరి నేడు మద్య నిషేధంపై కవిత్వం చెప్పడం బిజెపికే సిగ్గుచేటు. భరతసింహారెడ్డి సారా ఆంక్షలపై అనేక చెంచు పెంటలు ఎదురు తిరిగాయి. ఆయన రాక్షస కాండను నాటి ఉదయం దినపత్రిక ప్రముఖంగా ప్రచురించింది. లంబాడీ పురుషులను, స్త్రీలను విచక్షణా రహితంగా చిత్రహింసలకు గురి చేసిన నాటి సంఘటనను ధైర్యంగా చిత్రించి, వార్త పంపిన ఉదయం విలేకరి రాధాకృష్ణను కూడా పట్టుకొచ్చి చిత్రహింసలు పెట్టి చంపచూశాడు. ఇలాంటి వారిని బిజెపిలో పెట్టుకుని మద్య నిషేధంపై ధర్నాలు చేయిస్తే ప్రజలు ఏ విధంగా అర్థం చేసుకోగలరో కమలదళం నేతలు సెలవియ్యాలి. ఇకపోతే గత ఎన్నికల్లో పసుపు రైతులు ఎంతో నమ్మకంతో బిజెపి అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌ను గెలిపించారు. పసుపు బోర్డు ఏర్పాటుచేయిస్తానంటే నమ్మారు. అందుకోసం సిఎం కెసిఆర్ కుమార్తె కవితను ఓడించారు. కానీ తాజాగా ఎంపి అర్వింద్ చేసిన ప్రకటన పసుపు రైతులను హతాశులను చేసింది. త్వరలోనే పసుపు బోర్డు కంటే మెరుగైన వ్యవస్థ తెస్తున్నామని ప్రకటించడంలో ఆంతర్యమేమిటో అర్థంకావడం లేదు. లోక్‌సభ ఎన్నికల్లో పసుపు బోర్డు ఐదు రోజుల్లో తెస్తానని హామీలు గుప్పించినప్పుడు బిజెపి పెద్దలంతా ఢంకా బజాయించారు. ఎంపిగా అర్వింద్ గెలిచిన తర్వాత పసుపు బోర్డుపై యూ టర్న్ తీసుకున్న తీరుపై బిజెపి పెద్దలు ఆత్మవిమర్శలు చేసుకోవాలి.ఈదశలో పసుపురైతుల జేఏసీ ఆధ్వర్యంలో మరోసారి ఇందూరు రైతులు పోరాటానికి సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా పసుపు బోర్డు డిమాండ్ ప్రధానంగా పాదయాత్ర తలపెట్టారు. పసుపు బోర్డు అనే పేరు బాగా పాతదని, క్లస్టర్, టైస్ లాంటి పేర్లను అర్వింద్ పలుకుతుండడం.. వేరే పేరుతో పసుపు బోర్డు డిమాండ్‌ను మరోసారి ఏమార్చే పనిలో పడ్డారని రైతులు భగ్గుమంటున్నారు. ఎన్నికల సమయంలో రైతులకు హామీ ఇచ్చినప్పుడు దానికి న్యాయం చేయాలని బిజెపి నేతలకు గుర్తుకు రాకపోవడంపై రైతులు ప్రశ్నిస్తున్నారు. మద్యనియంత్రణలో డికె అరుణ, పసుపుబోర్డు ఏర్పాటులో అర్వింద్ హామీల విషయంలో బిజెపి ఒట్టుతీసి గట్టున పెట్టి ప్రవర్తిస్తున్న తీరు కారణంగా బిజెపి పట్ల ప్రజల్లో చులకన ఏర్పడడం సహజం.

ఆంగ్లో ఇండియన్లకు చెల్లుచీటి

నామినేటెడ్ పదవుల విషయంలో బిజెపి నిర్ణయం

న్యూఢిల్లీ,డిసెంబర్16(ఆర్ఎన్ఎ): చట్టసభల్లో ఆంగ్లో ఇండియన్ నియమాకాలకు కాలం చెల్లింది. వీరి ముసుగులో క్రిష్టియన్లను సబకు పంపుతూ వస్తున్నారు. మొత్తంగా మొన్నటి రిజర్వేషన్ల బిల్లుతో వీరికి కూడా కాలం చెల్లింది. ఇది గ్రహించే కాంగ్రెస్ ఎంపి రేవంత్ రెడ్డి ఆంగ్లో ఇండియన్ రిజర్వేషన్లు ఎత్తేయాలని ప్రధాని మోడీకి కొన్ని రోజుల ముందు లేఖ రాశారన్న అనుమానం కలుగుతోంది. మన దేశంలో పోటీతో నిమిత్తం లేకుండా చట్టసభలోకి ప్రవేశించే కేటగిరీలో ఆంగ్లో ఇండియన్లు ఏడు దశాబ్దాలుగా ఉంటున్నారు. వీరిని అసెంబ్లీకి గవర్నర్,లోక్‌సభకు రాష్ట్రపతి నామినేట్ చేస్తూ వచ్చారు. ఇటీవల రిజర్వేషన్లను పొడిగిస్తూ చేసిన రాజ్యాంగ సవరణలో ఆంగ్లో ఇండియన్లను చేర్చలేదు. ఎందుకంటే, దేశంలో కేవలం 296 మంది మాత్రమే ఉన్నారని 2011 జనాభా లెక్కలు చెబుతున్నాయి. బ్రిటిష్ పాలనకు గుర్తుగా మిగిలిపోయిన ఆంగ్లో ఇండియన్ల కోటాని మోడీ సర్కారు పొడిగించకుండా ప్రస్తుతానికి పక్కన పెట్టేసింది. రిజర్వేషన్లను పొడిగించడానికి ఉద్దేశించిన ఆర్టికల్ 334ని సవరించడంతో ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీకి మరో పదేళ్లపాటు చట్టసభల్లో రిజర్వేషన్ అమలు కానుంది. ఇదే తరహాలో పొడిగించాల్సిన ఆంగ్లో ఇండియన్ల విషయాన్ని మాత్రం పక్కన పెట్టింది. దీంతో నామినేటెడ్ పదవుల పీడవిరగడ అయ్యిందనే భావించాలి.

దేశంలో 2011 జనాభా లెక్కల ప్రకారం ఆంగ్లో ఇండియన్లు కేవలం 296 మంది మాత్రమే ఉన్నందున, వారికోసం సీట్లను రిజర్వ్ చేయనవసరం లేదని మోడీ సర్కారు భావించి, ఆమేరకు నిర్ణయం తీసుకుందన్నప్రచారం సాగింది. దాదాపు 67 ఏళ్లుగా అమల్లో ఉన్న ఈ కోటాని పొడిగించకూడదన్నది ప్రభుత్వం నిర్ణయంగా తెలుస్తోంది. చట్టసభల్లో ఎస్సీ, ఎస్టీ, ఆంగ్లో ఇండియన్? కమ్యూనిటీలకు కల్పిస్తున్న రిజర్వేషన్ గడువు వచ్చే ఏడాది జనవరి 25తో ముగియనుంది. అందువల్ల ఆర్టికల్ 334ని సవరిస్తూ ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే పొడిగింపునిచ్చింది. ప్రస్తుత లోక్‌సభలో ఆంగ్లో ఇండియన్లు ఎవరినీ నామినేట్ చేయలేదు. దేశంలోని 28 రాష్ట్రాలు చట్టసభలున్న 3 యూటీలు ఉన్నాగానీ; తెలంగాణ, ఏపీ సహా 14 రాష్ట్రాల్లో మాత్రమే ఆంగ్లో ఇండియన్లను నామినేట్ చేస్తున్నారు. తెలంగాణ ఏర్పడ్డాక రెండు అసెంబ్లీల్లోనూ ఎల్విస్ స్టీఫెన్‌సన్ నామినేట్ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం అక్కడ ఎవరినీ భర్తీ చేయలేదు. ఇక భర్తీకి అవకాశం ఉండకపోవచ్చు. స్వాతంత్ర్యం వచ్చాక చాలామంది ఆంగ్లో ఇండియన్లు బ్రిటన్‌కు, ఆస్ట్రేలియా, కెనడాలకు వెళ్లిపోయారు. ఆ తరవాత కాలంలో వారి సంఖ్య తగ్గుతూ వచ్చింది. ఈ దశలో దీనిని తొలగించడం స్వాగతించాల్సిన విసయం.

పల్లెల్లో మళ్లీ ప్రణాళికా పనులు

రంగం సిద్ధం చేస్తున్న అధికారులు

ఆదిలాబాద్,డిసెంబర్16(ఆర్ఎన్ఎ): ప్రభుత్వం చేపట్టిన 30 రోజుల ప్రణాళిక కార్యక్రమం మరోమారు ముందుకు రావడంతో అందుకు తగ్గట్లుగా పనిచేసేందుకు అధికారులు కసరత్తుచేయబోతున్నారు. గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికే ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. ఇందులో 30 రోజుల ప్రత్యేక కార్యాచరణలో స్థానికులు ముందుకు వచ్చి చేయి, చేయి కలిపి గ్రామాలను అభివృద్ధి చేయడంతో తమవంతు పాత్రను పోషించారు. జిల్లాలోని 467 గ్రామ పంచాయతీలు ఉండగా అన్ని పంచాయతీల్లో అధికారులు 30 రోజులు ప్రణాళికలో భాగంగా పలు అభివృద్ధి పనులను చేపట్టారు. ఇందులో భాగంగా జిల్లాలోని గ్రామాల్లో పచ్చదనం వెల్లివిరిసేలా చర్యలకు ఉపక్రమించారు. పారిశుద్యానికి కూడా ప్రాధాన్యం ఇచ్చారు. ఇది విజయవంతం కావడంతో మరో 30రోజుల ప్రణాళిక కోసం మంత్రి ఎర్రబెల్లి దయాకర్రావు చొరవ చూపారు. త్వరలోనే అదికూడా ప్రజల ముందుకు రానుంది. గతంలో చేపట్టిన ప్రణాళికలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు అందరూ పాల్గొని గ్రామాలకు సరికొత్త రూపును తీసుకొచ్చారు. జిల్లాలోని ఏజెన్సీ గూడేలు, తండాలతో పాటు మారుమూల ప్లలెల్లో సైతం స్థానికులు స్వచ్ఛందంగా భాగస్వాములై తమ గ్రామాల అభివృద్ధిలో పాలుపంచుకున్నారు.ప్రజలకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ఈ జనవరి 2 నుంచి రెండో విడత పల్లెప్రగతి కార్యక్రమాన్ని చేపట్టనున్నది. 10 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో వైకుంఠధామాలు, డంపింగ్‌యార్డుల నిర్మాణాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఇందుకు దాతల సహకారం తీసుకోనున్నారు. జిల్లా వ్యాప్తంగా 467 గ్రామ పంచాయతీల్లో 30 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక విజయవంతంగా ముగిసింది. జిల్లాలో ఈ కార్యక్రమం ఉద్యమం లా కొనసాగగా ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికుల సహకారంతో గ్రామాల్లో మార్పును తీసుకుని రాగలిగారు. నెలరోజుల పాటు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించిన ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు ఈ కార్యక్రమం ఉద్దేశాలను తెలియజేశారు. పచ్చదనం, పరిశుభ్రతతో కలిగే ప్రయోజనాలను వివరించారు.

ఈ కార్యక్రమానికి ముందు పిచ్చిమొక్కలు, పేరుకుపోయిన మురికాలువలు, శిథిలావస్థకు చేరిన ఇళ్లు, బురదమయంగా ఉన్న రోడ్లు, వేలాడుతున్న కరెంటు తీగలు, వంగిపోయి అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ స్తంభాలను సరి చేయడంతో గ్రామాలు ప్రస్తుతం కొత్త శోభను సంతరించుకున్నాయి. ఇదే స్ఫూర్తిగా జనవరి 2 నుంచి 11 వరకు పది రోజుల పాటు ప్లలె ప్రగతి కార్యక్రమం అమలు కానున్నది. ఈ కార్యక్రమంలో ప్రధానంగా వైకుంఠధామాలు, డంపింగ్‌యార్డులు, నర్సరీల పెంపకం చేపట్టనున్నారు. జడ్పీ చైర్మన్, కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, ఉపసర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో ప్లలె ప్రగతి రెండో విడత సన్నద్ధత సమావేశాలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 28 లోగా ఈ సమావేశాలు పూర్తి చేసి జనవరి 2 నుంచి పల్లెప్రగతి కార్యక్రమాన్ని ప్రారంభించేలా చర్యలు తీసుకుంటారు. జిల్లా వ్యాప్తంగా 467 గ్రామ పంచాయతీల్లో డంపింగ్‌యార్డులు, వైకుంఠధామాల నిర్మాణాలు పూర్తి చేయాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జిల్లాలో వైకుంఠధామాల నిర్మాణం, డంపింగ్‌యార్డుల ఏర్పాటుకు స్థలాల సేకరించారు. కార్యాచరణ ప్రణాళికకు ముందు జిల్లా వ్యాప్తంగా 122 వైకుంఠధామాలు ఉ

పౌరసత్వ సవరణ బిల్లుకు కేరళ వ్యతిరేకం

తిరువనంతపురం, డిసెంబర్16: పౌరసత్వ చట్ట సవరణకు వ్యతిరేకంగా కేరళలోనూ నిరసనలు వ్యక్తమవుతున్నాయి. అధికార ఎల్డీఎఫ్, విపక్ష యూడీఎఫ్ సంయుక్తంగా నిరసన ప్రదర్శన చేపట్టాయి. సత్యాగ్రహ పేరిట ఉమ్మడిగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ దీక్షకు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ప్రతిపక్ష నేత రమేశ్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా కేరళ సీఎం పినరయి విజయన్ మాట్లాడుతూ.. దేశంలో ఉద్రిక్త పరిస్థితులకు బీజేపీనే కారణమన్నారు. ప్రస్తుత వాతావరణాన్ని బీజేపీ – ఆర్ఎస్ఎస్ కలిసి సృష్టించాయని ధ్వజమెత్తారు. బీజేపీ – ఆర్ఎస్ఎస్ కలిసి దేశంలో తమ ఎజెండాను అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. దేశంలో పరిస్థితి అస్థిరంగా ఉందన్నారు. పౌరసత్వ చట్ట సవరణకు కేరళ ప్రభుత్వం వ్యతిరేకం అని సీఎం పినరయి విజయన్ స్పష్టం చేశారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సత్యాగ్రహ దీక్ష ఇవాళ మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగనుంది.

పుకార్లు నమ్మొద్దు..ఎవరూ చనిపోలేదు: వర్సిటీ వీసీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 16: పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పలు యూనివర్సిటీల్లో విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. ఆదివారం ఢిల్లీలో జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయం విద్యార్థులు చేపట్టిన నిరసన హింసాత్మకంగా మారిన సంగతి తెలిసిందే. వర్సిటీలోకి పోలీసులు ప్రవేశించి పలువురు విద్యార్థులను అదుపులోకి తీసుకోవడాన్ని వర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ నజ్మా అక్తర్ ఖండించారు. నిన్న జరిగిన సంఘటనల గురించి ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

'విశ్వవిద్యాలయంలో భారీగా ఆస్తినష్టం జరిగింది. వీటన్నింటికి పరిహారం ఎలా భర్తీ చేయాలి? భావోద్వేగాల పరంగా కూడా చాలా కోల్పోయాం. నిన్నటి ఘటన చాలా దురదృష్టకరం. ఎలాంటి పుకార్లను నమ్మొద్దని ప్రతిఒక్కరికీ విజ్ఞప్తి చేస్తున్నా. వర్సిటీ క్యాంపస్‌లోకి పోలీసులు ప్రవేశించడంపై ఎఫ్ఐర్ నమోదు చేయిస్తాం. ధ్వంసమైన ఆస్తులను తిరిగి పునర్నిర్మించుకోవచ్చు కానీ, విద్యార్థులు అనుభవించిన మనోవేదనను పూడ్చలేం. ఉన్నతస్థాయి దర్యాప్తు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. ఇద్దరు విద్యార్థులు మృతిచెందారని వదంతులు వ్యాప్తిచేస్తున్నారు. ఏ విద్యార్థి కూడా చనిపోలేదు. వీటిని మేం పూర్తిగా ఖండిస్తున్నాం. నిన్న జరిగిన ఘటనలో సుమారు 200 మంది గాయపడగా అందులో ఎక్కువ మంది మా విద్యార్థులేనని' నజ్మా అక్తర్ వివరించారు.

వర్సిటీ క్యాంపస్‌లో పోలీసులు కాల్పులు జరిపారని వస్తున్న వార్తలపై విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఏపీ సిద్ధిఖీ స్పందించారు. ఇదే విషయంపై జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్‌తో పాటు ఉన్నతాధికారులతో మాట్లాడామని, ఐతే ఫైరింగ్ పుకార్లను వారంతా ఖండించారని సిద్ధిఖీ తెలిపారు. సోషల్‌మీడియాలో పుంఖానుపుంఖాలుగా వదంతులు వ్యాప్తిచేస్తున్నారు. వాటన్నింటిని మేం అంగీకరించలేం.. తిరస్కరించలేమని ఆయన పేర్కొన్నారు.

టిడిపి నేతలపై మండిపడ్డ విజయసాయి

దృష్టి మళ్లించే కథనాలపై ఆగ్రహం

అమరావతి,డిసెంబర్16(ఆర్ఎన్ఎ): మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలపై వైసీపీ ఎంపీ విజయ సాయిరెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వంలో కీలక పోస్టులన్నీ సొంత సామాజిక వర్గానికే కేటాయించారని యనమల ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో యనమలతో పాటు టీడీపీ అధినేత చంద్రబాబుపై విజయ సాయిరెడ్డి విమర్శలు చేశారు. కిరసనాయిలుకు సెటిల్మెంట్ల ఆదాయం పోయింది. మరోవైపు కులదైవం చంద్రబాబు రాజకీయంగా ఉనికి కోల్పోతుండటాన్ని చూడలేక దృష్టి మళ్లించే కథనాలు వదులుతున్నాడు. ఎన్నికల ముందు ఇలాంటి అసత్యాలు లెక్కలేనన్ని అచ్చేసినా ప్రజలు ఛీ కొట్టారు. అయినా యజమాని కోసం పిచ్చి రాతలు రాస్తూనే ఉన్నాడు. యనమల గారు కూడా నీతి బోధనలు చేస్తున్నారు. ఎన్టీఆర్ కు వెన్నుపోటు పొడిచిన కుట్రలో ఈయన ప్రధాన భాగస్వామి. అప్పటి పల్లకీ సేవకు తన బంధువులకు అనేక పదవులు, వేల కోట్ల కాంట్రాక్టులు ఇప్పించుకున్నాడు. కులజ్యోతి రాసిన కడుపు మంట వార్తను పట్టుకుని పత్తిగింజ కబుర్లు చెబుతున్నాడని విజయ సాయిరెడ్డి ఎద్దేవా చేశారు.

అత్యాచారంతో విద్యార్థిని ఆత్మహత్య

నిందితుల కోసం పోలీసుల గాలింపు

ఏలూరు,డిసెంబర్16(ఆర్ఎన్ఎ): పశ్చిమగోదావరి జిల్లాలోని టి. నర్సాపురంలో దారుణ సంఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. పురుగుల మందు తాగి విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. సంఘటన వివరాల్లోకి వెళితే ఈ నెల 7వ తేదీన విద్యార్థినిపై రాజు అనే వ్యక్తి అత్యాచారం చేశాడు. అత్యాచారం విషయం విద్యార్థిని తన ప్రియుడు సుబ్రహ్మణ్యానికి చెప్పింది. దీనిపై కోపగించిన ప్రియుడు చనిపోవాలంటూ ఆమెకు సూచించాడు. మనస్తాపంతో విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. విద్యార్థిని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడు రాజు, ప్రియుడు సుబ్రహ్మణ్యంపై కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలిస్తున్నారు.

'దిశ'తో మహిళలకు భద్రత

వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం

కర్నూలు,డిసెంబర్16(ఆర్ఎన్ఎ): ఏపీ దిశ-2019 చట్టంతో స్త్రీలకు భద్రత లభిస్తుందని పలువురు మహిళలు పేర్కొన్నారు. కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. జై జగన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా జాయింట్ సెక్రటరీ ముంజుశ్రీ మాట్లాడుతూ.. మహిళలపై నేరాలకు పాల్పడితే వారం రోజుల్లో విచారణ జరిపి, నేరం రుజువైతే 21రోజుల్లో తగిన శిక్ష పడేలా చట్టం తీసుకురావడం సామాన్యవైన విషయం కాదన్నారు. దేశంలో ఏ

ముఖ్యమంత్రి..ఇలాంటి చట్టాన్ని తీసుకురాలేదని చెప్పారు. మహిళలకు రక్షణ, భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కార్యక్రమంలో లక్ష్మీదేవి, పద్మావతి, కళావతి, రమాదేవి, రాణి, లక్ష్మి, రమిజాబీ, కమలమ్మ, కాంతమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు కాశన్న, వీరయ్య, రాము, రాజశేఖర్‌రెడ్డి, నరసింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో తిరుప్పావై సేవ

తిరుమల,డిసెంబర్16(ఆర్ఎన్ఎ): తిరుమలలో ధనుర్మాస ఉత్సవాలు మంగలశాసనంనుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెలరోజుల పాటు రోజూ ధనుర్మాస ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. సూర్యుడు మగంళవారం నుంచి ధనస్సు రాశిలో ప్రవేశిస్తుండటంతో తిరుమల శ్రీవారి ఆలయంలో స్వామివారికి సుప్రభాతం బదులుగా తిరుప్పావై సేవ చేపట్టారు. నిత్యం కౌసల్య సుప్రజా రామా పూర్వా సంధ్యా ప్రవర్తతే అంటూ స్వామి వారిని మేల్కొపే అర్చకులు.. శతమిళ దివ్య ప్రబంధంలోని శ్రీగోదాదేవి విరచితమైన 30 పాశురాళ్ల పద్యాలతో మేల్కొలపనున్నారు. నెలరోజులపాటు సుప్రభాతం సేవ తిరుమలలో రద్దవుతుంది. తిరప్పావై, సహస్ర నామార్చన, తోమాల సేవలు కొనసాగుతాయి. సహస్రనామార్చనలో స్వామివారికి తులసీదళానికి బదులుగా బిల్వపత్రాన్ని వినియోగిస్తారు. స్వామివారి అలంకారంలో కూడా మార్పు జరుగుతుంది. సాధారణంగా భోగశ్రీనివాసమూర్తికి ఏకాంతసేవ జరుగుతుంది. ధనుర్మాసంలో మాత్రం భోగశ్రీనివాసమూర్తికి బదులు గర్భాలయంలో ఉండే శ్రీకృష్ణస్వామికి ఏకాంత సేవ, పవళింపు సేవలను నిర్వహిస్తారు.

టీడీపీ హయాంలో..

పేదల ఇళ్ల నిర్మాణంలో అవినీతి జరిగింది

- 3లక్షలు ఇళ్లకు రూ.2,626 కోట్లు దోపిడీ చేశారు
- అసెంబ్లీలో విమర్శలు గుప్పించిన మంత్రి బొత్స సత్యనారాయణ
- మేం తప్పుచేసినట్లు నిరూపిస్తే ఎలాంటి చర్యకైనా సిద్ధం
- ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే హౌస్ కమిటీ వేయండి
- సవాల్ విసిరిన టీడీపీ ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు
- చర్చకు అవకాశమివ్వకపోవటంతో సభనుంచి వాకౌట్ చేసిన టీడీపీ

అమరావతి, డిసెంబర్16(ఆర్ఎన్ఎ) : ఏపీ అసెంబ్లీలో పేదల ఇళ్ల నిర్మాణాలపై అధికార, ప్రతిపక్ష పార్టీల సభ్యుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. సోమవారం ఆరవ రోజు అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగానే స్పీకర్ ప్రశ్నోత్తరాలు చేపట్టారు. మొదట.. రాష్ట్రంలో రివర్స్ పాలనకు వ్యతిరేకంగా టీడీపీ వాయిదా తీర్మానం ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా టీడీపీ ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 80 శాతం పూర్తయిన ఇళ్ల నిర్మాణాలను నిలిపివేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి లేదని.. లబ్దిదారులు ఆందోళనలో ఉన్నారని విమర్శించారు. ఇళ్ల నిర్మాణం పూర్తయ్యే వరకు పేదలకు నెలకు రూ. 3వేలు చొప్పున అద్దె చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. టీడీపీ సభ్యులు సభలో అన్ని అసత్యాలు చెబుతున్నారని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో ఒక్కఇల్లు కూడా పూర్తిచేసి ఇవ్వలేదని మంత్రి చెప్పుకొచ్చారు. లబ్దిదారులను తొలగించామంటూ దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం ఆదరాబాదరగా ఇళ్లు కట్టించిందని బొత్స విమర్శించారు. ఆధునిక పరిజ్ఞానంతో నిర్మించి వెంటనే లబ్దిదారులకు ఇవ్వాలని మా లక్ష్యమని అన్నారు. పేదల ఇళ్ల నిర్మాణంలో అవినీతి జరిగిందని, అందుకే రివర్స్ టెండరింగ్ వెళ్తామని ముందే చెప్పామని మంత్రి స్పష్టం చేశారు. రివర్స్ టెండరింగ్‌లో రూ. 150 కోట్లు మిగిలిందని, పేదలు జీవితాంతం కట్టాల్సిన పరిస్థితి వచ్చిందని, గత పాలన పేదల నిర్మాణంలో అంతా అవినీతే అని అన్నారు. రివర్స్ టెండరింగ్ వల్ల ఇంటికి రూ. 75వేలు ఆదా అయ్యిందని, ఈ లెక్కన 3లక్షలు ఇళ్లకు రూ.2,626 కోట్లు దోపిడీ చేశారని బొత్స తీవ్ర విమర్శలు గుప్పించారు. అనంతరం టీడీపీ ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు మాట్లాడు తూ.. మేం తప్పు చేసినట్టు నిరూపిస్తే ఎలాంటి చర్యలకైనా సిద్ధమని పేర్కొన్నారు. టీడీపీ హయాంలో లక్షలాది ఇళ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. వైసీపీ ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణంపై పట్టించుకోవడం లేదని విమర్శించారు. లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయినా ప్రభుత్వం లబ్దిదారులకు ఇవ్వడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇళ్ల నిర్మాణంపై హౌస్ కమిటీ వేయాలని ఆయన డిమాండ్ చేశారు. టీడీపీ హయాంలో పేదలకు నాణ్యమైన ఇళు నిర్మించామని అచ్చెన్న చెప్పుకొచ్చారు. కాగా బొత్స మాట్లాడుతూ.. పేదల ఇళ్ల విషయంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని, అర్హులైన వారికి ఇళ్లు అందిస్తామని అన్నారు. టీడీపీ సభ్యులు అసత్యాలు మాట్లాడటం వల్ల సభను తప్పుదోబ పట్టించాలని చూస్తున్నారని బొత్స ఆగ్రహం వ్యక్తం చేశారు. బొత్స మాట్లాడిన అనంతరం స్పీకర్ ఇంకో సబ్జెక్ట్ పై ప్రశ్నలు అడుగాలని సభ్యులకు సూచించారు. దీంతో టీడీపీ సభ్యులు నిరసన తెలిపారు. ఆయన చెప్పింది ఏమీ అర్థం కాలేదని, తమకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని టీడీపీ నేతలు స్పీకర్‌ను కోరారు. అందుకు సభాపతి అవకాశం ఇవ్వకుండా వేరే ప్రశ్నకు వెళ్లారు. దీంతో ప్రభుత్వ తీరుకు నిరసన వ్యక్తం చేస్తూ.. తమకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా...వేరే ప్రశ్నకు వెళ్లడంపై టీడీపీ సభ నుంచి వాకౌట్ చేసింది.

చంద్రబాబు 'రివర్స్ వాక్'

- టీడీపీ ఆధ్వర్యంలో వినూత్న నిరసన
- రివర్స్ పాలన వల్ల రాష్ట్రం అధోగతిపాలైంది
- టెండర్లన్నీ రిజర్వ్ చేసుకొని రివర్స్ అంటున్నారు
- వైకాపా పాలనపై మండిపడ్డ ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడు

అమరావతి, డిసెంబర్16(ఆర్ఎన్ఎ) : వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్‌పై టీడీపీ సభ్యులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబుతో సహా నేతలందరూ సచివాలయం ఫైర్‌స్టేషన్ వద్ద నుండి అసెంబ్లీ వరకు వెనక్కు నడుస్తూ నిరసన తెలిపారు. ఏపీ అసెంబ్లీ సమావేశాలు ఆరో రోజు ప్రారంభమయ్యాయి. సోమవారం రాష్ట్రంలో రివర్స్ పాలన- తిరోగమనంలో రాష్ట్ర అభివృద్ధి అంశంపై టీడీపీ వినూత్నంగా ఆందోళనలు చేపట్టింది. ప్రతిపక్ష నేత చంద్రబాబు అధ్యక్షతన నిరసన చేపట్టారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సచివాలయం ఫైర్ స్టేషన్ నుంచి నిరసన ర్యాలీ చేపట్టారు. వెనక్కి నడుస్తూ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. రాష్ట్రంలో టెండర్లన్నీ రిజర్వు చేసుకుని రివర్స్ టెండరింగ్ పేరుతో అబద్దాలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కళ్లముందు కనిపిస్తున్న రాజధాని అమరావతి అని, ప్రభుత్వానికి రూ. 2లక్షల కోట్ల సంపద వచ్చే ఆస్తి అని అన్నారు. అలాంటి బంగారు గుడ్డుపెట్టే బాతును ఇస్తే.. పెంచుకుంటూ ముందుకు పోకుండా.. నేడు అమరావతిని చంపేసే పరిస్థితికి వచ్చిందని చంద్రబాబు విమర్శించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎవరూ ముందుకు రావడంలేదన్నారు. రాష్ట్రంలో ఉన్మాది పాలన...తుగ్లక్ పాలన నడుస్తోందని చంద్రబాబు మండిపడ్డారు.

నేటి నుంచి తిరుమలలో తిరుప్పావై!

- జనవరి 14 వరకు సుప్రభాతం స్థానంలో తిరుప్పావై

చిత్తూరు, డిసెంబర్16(ఆర్ఎన్ఎ) : దక్షిణాయనానికి చివర, ఉత్తరాయణనానికి ముందుడే ధనుర్మాసం ప్రాత:కాలంలా అత్యంత పవిత్రమైంది. ధనుర్మాసం అంటే దివ్య ప్రార్థనకు అనువైన మాసం అని అర్థం. ధను అనగా దేని కోసం ప్రార్థించడమనే అర్థం దృష్ట్యా ధనుర్మాసం అత్యంత విశిష్టమైంది.

ధనుర్మాసం తెలుగు సంస్కృతిలో ఒక భాగం. దేవాలయాల్లో జరిగే ఆగమ శాస్త్ర కైంకర్యాలలో స్థానిక ఆచార వ్యవహారాలు, ఇతర సంప్ర దాయాలు కలిసిన అంశాలలో ధనుర్మాసం ఒకటి. ధనుర్మాసం కాలంలో తిరుమల శ్రీవారి ఆలయంలో సుప్రభాతానికి బదులుగా తిరుప్పావై పఠనం చేస్తారు.

సహస్రనామార్చనలో తులసికి బదులు బిల్వపత్రాలతో పూజిస్తారు. అత్యంత ధనుర్మాసాన్ని పురస్కరించుకుని మంగళ వారం తెల్లవారుజాము నుంచి జనవరి 14 వరకు తిరుమల శ్రీవారి ఆలయంలో సుప్రభాతం స్థానంలో తిరుప్పావై నివేదించనున్నారు.

సోమవారం రాత్రి 11.47 గంటలకు విశేషమైన ధనుర్మాన గడియలు ప్రారంభమవుతున్నాయి. శ్రీవారి ఆలయంలో నెలపాటు జరిగే తిరుప్పావై పారాయణంలో గోదాదేవి రచించిన 30పాశురాలను అర్చకులు రోజుకొకటి చొప్పున నివేదిస్తారు. ఈ సందర్భంగా భోగశ్రీనివాసమూర్తికి బదులు శ్రీకృష్ణస్వామికి ఏకాంతసేవ నిర్వహిస్తారు. అలాగే సహస్రనామార్చనలో తులసికి బదులు బిల్వపత్రాలతో పూజిస్తారు. ధనుర్మాసం నెల రోజులు బ్రహ్మ ముహూర్తంలో పారాయణం చేసిన వారు దైవానుగ్రహాన్ని పొందుతారని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. సాక్షాత్తు భూదేవి అవతారమైన అండాళ్ రచించిన దివ్య ప్రబంధమే తిరుప్పావై. ద్రవిడ భాషలో తిరు అనగా పవిత్రం, పావై అనగా వ్రతం అని అర్థం. వేదాలు, ఉపనిషత్తుల సారమే తిరుప్పావై అని హిందూ పురణాల్లో పేర్కొన్నారు.

ర్యాంకులే కాదు..

నైతిక విలువలు ముఖ్యమే

- విద్యార్థులు సోషల్ మీడియా, టీవీలకు దూరంగా ఉండండి
- చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి
- ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు
- జడ్పీ ఉన్నత పాఠశాల భవనాన్ని ప్రారంభించిన మంత్రి

సంగారెడ్డి, డిసెంబర్16(నేటినిజం ప్రతినిధి): నేటితరం విద్యార్థులు కేవలం ర్యాంకుల కోసమే చదువుతున్నట్లు కనిపిస్తుందని, విద్యార్థులకు ర్యాంకులు ముఖ్యమేనని, కానీ వాటి కన్నా నైతిక విలువలు ఇంకా ముఖ్యమని ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. పటాన్‌చెరు టౌన్‌లో నూతనంగా నిర్మించిన జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల(బాలికలు) భవనాన్ని సోమవారం మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులకు మార్కులు, ర్యాంకులు ముఖ్యమేనని, వాటి కన్నా నైతిక విలువలు ఇంకా ముఖ్యమని అన్నారు. విద్యార్థులు సోషల్ మీడియా, టీవీలు, సినిమాలకు దూరంగా ఉండి.. చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని మంత్రి సూచించారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పటాన్ చెరువును ఎడ్యుకేషన్ హబ్‌గా తయారు చేశారని, పిల్లలు ఆడుకునేందుకు మంచి స్టేడియంను కూడా ఏర్పాటు చేశా రని కొనిడాయరు. పదో తరగతిలో వచ్చిన ఫలితాల మాదిరిగానే ఇంటర్, డిగ్రీలో వందకు వంద శాతం ఫలితాలు రావాలన్నారు మంత్రి. మార్చి నాలుగో తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు సాయంత్రం వేళ స్నాక్స్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాల న్నారు. విద్యార్థుల దశ, దిశ మార్చేది ఇంటర్, డిగ్రీ మాత్రమే అని మంత్రి తెలిపారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిం చాలని సూచించారు. పిల్లల్లో చదువులతో పాటు నైతిక విలువలు పెంపొందించాన్నారు. సంప్రదాయాలు నేర్పించి, సామాజిక స్పృహ చేయించాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు పాల్గొన్నారు. ఆడపిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు కలెక్టర్, ఎస్పీ, ఇతర ఉన్నత వ్యక్తులతో ప్రత్యేక తరగతులు నిర్వహించా లన్నారు. బాలికలకు మహిళా పోలీసు అధికారులతో అవగాహన కార్యక్ర మాలు ఏర్పాటు

సాంకేతికతో నేరాలకు అడ్డుకట్ట

కర్నూలు,డిసెంబర్16(ఆర్ఎన్ఎ): సాంకేతికతను ఉపయోగించుకుని నేరాలను ఎప్పటికప్పుడు పోలీసులు ఉన్నతాధికారులకు వివరించాలని జిల్లా పోలీసులు అన్నారు. కానిస్టేబుళ్లు వాట్సప్ సాంకేతిక పరిజ్ఞానంతో కింది స్థాయిలో జరిగే సంఘటనలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు వివరించవచ్చన్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితి బేష్‌గా ఉందని, పూర్తి స్థాయిలో ప్రశాంత వాతావరణం ఉందని అన్నారు. ప్రజల సహకారం, పోలీసుల సమన్వయంతో జిల్లాలో ప్రశాంత వాతావరణం నెలకొందన్నారు. రోడ్డు ప్రమాదాల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను కోర్టు అనుమతితో వేలం వేశామన్నారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి నేర సంఘటనలు జరగడం లేదన్నారు. జిల్లాలో దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు కూడా ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో మంచి ఫలితాలు వచ్చాయన్నారు.

కరీంనగర్ కలెక్టర్ సర్ఫరాజ్‌పై వేటు

మంత్రితో వివాదమే కారణమని ప్రచారం

కరీంనగర్,డిసెంబర్16(నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ జిల్లా కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ పై రాష్ట్ర ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. మంత్రి గంగుల, ఎమ్మెల్యే రసమయితో నెలకొన్న వివాదం నేపథ్యంలో ఈ బదిలీ జరిగినట్లు ప్రచారం సాగుతోంది. బిజెపి ఎంపి బండి సంజయ్, సర్ఫరాజ్‌ల మధ్య నడిచిన ఫోన్ సంభాషణ కొన్ని రోజుల క్రితం లీక్ కావడం కలకలం రేపింది. తనకు వ్యతిరేకంగా, సంజయ్‌కు అనుకూలంగా కలెక్టర్ వ్యవహరిస్తున్నారని అప్పట్లో మంత్రి గంగుల కమలాకర్ ఆరోపించారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి కెసిఆర్‌కు కూడా ఫిర్యాదు చేశారు. మరోవైపు, ఇదే విషయంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సర్ఫరాజ్ వివరణ కూడా ఇచ్చారు. ఆడియో టేపును ఎడిట్ చేసి లీక్ చేశారని కలెక్టర్ వివరించారు. అప్పట్లోనే సర్ఫరాజ్ పై చర్యలు తీసుకుంటారనే వార్తలు వచ్చినా అలాంటి చర్యలను ప్రభుత్వం తీసుకోలేదు. తాజాగా ఆయనపై బదిలీ వేటు పడింది. కాసేపట్లో బదిలీకి సంబంధించిన ఉత్తర్వులు వెలువడనున్నాయి.

సిర్పూర్‌లోని ఎంపీడీవోపై గృహ హింస కేసు

-వరకట్న వేధింపులతో భార్య ఫిర్యాదు

కొమురంభీమ్,డిసెంబర్16(ఆర్ఎన్ఎ): సిర్పూర్‌లోని ఎంపీడీవోపై గృహ హింస కేసు నమోదైంది. ఎంపీడీవో జగదీష్‌పై కాగజ్‌నగర్ పీఎస్‌లో భార్య మేరీకుమారి ఫిర్యాదు చేసింది. అదనపు కట్నం తేవాలంటూ తనను శారీరకంగా హింస్తున్నట్లు మేరి పేర్కొంది. కత్తితో చేతులపై గాట్లు పెడుతూ నరకానికి గురి చేస్తున్నట్లు ఆమె ఫిర్యాదులో తెలిపింది. గుంటూరుకు చెందిన మేరీకుమారితో జగదీష్‌కి 2018లో వివాహమైంది. అయితే, ఉద్యోగ రీత్యా వీరు కాగజ్‌నగర్‌లోని శ్రీరాంనగర్ కాలనీలో నివాసముంటున్నారు. ఈ క్రమంలోనే ఈ నెల 13వ తేదీన రాత్రి తాగిన మైకంలో ఇంటికి వచ్చిన తన భర్త జగదీశ్ అదనపు కట్నం తేవాలంటూ గొడవ పడ్డాడని, కత్తితో దాడి చేసి చేతులు, వీపు భాగంలో గాయపర్చాడంటూ బాధితురాలు గోడు వెల్లబోసుకుంది.. గతంలోనూ ఇదే తరహాలో తనపై హత్యాయత్నం జరిగిందని, ఇప్పటికైన తన భర్తకు తగిన బుద్ధి చెప్పి, తనకు న్యాయం చేయాలంటూ ఆమె కన్నీటి పర్యంతమయ్యింది. జిల్లాలోని సిర్పూర్(టి) ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న జగదీశ్ అనిల్‌కుమార్‌పై అతని భార్య మేరీ కుమారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆదివారం ఎస్పీ మల్లారెడ్డిని కలిసి తనకు న్యాయం చేయాలని కోరింది. జగదీశ్ అనిల్ కుమార్ స్వస్థలం గుంటూరు జిల్లా నరసరావుపేట. కాగా.. పోలీసులు ఎంపీడీవో జగదీష్ అనిల్ కుమార్‌పై గృహ హింస, వరకట్నం కింద కేసులు నమోదు చేశారు. దీంతో.. ఎంపీడీవో ఊరి నుంచి జగదీష్ పరారయ్యాడు. అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు.

డయల్ 100 ద్వారా 3471 ఫిర్యాదుల పరిష్కారం

- కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి

కరీంనగర్,డిసెంబర్16(నేటినిజం ప్రతినిధి): శాంతిభద్రతలకు సంబంధించి తలెత్తే సమస్యలపై సత్వరం స్పందన, పరిష్కారం కోసం ఏర్పాటైన "డయల్ 100" సేవలకు గత నవంబర్ నెలలో 3471 అత్యవసర ఫిర్యాదులు అందగా పరిష్కరించడం జరిగిందని కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దోపిడి, దొంగతనాలు, తగాదాలు,రోడ్డు ప్రమాదాలు, హత్యలు, హత్యాయత్నాలు, ఆత్మహత్యలు, తప్పిపోవుట, కిడ్నాప్, అత్యాచారయత్నాలు, గృహహింస, అసాంఘీక కార్యకలాపాలు మొదలగు ఆపదలు సంభవించిన సందర్భంలో "డయల్ 100" సేవలను సద్వినియోగం చేసుకుంటున్నారు.

దొంగలుగా భావించి స్థానికులపై దాడి

ఒకరు మృతి....నలుగురికి తీవ్ర గాయాలు

జిగిత్యాల,డిసెంబర్16(ఆర్ఎన్ఎ): జిల్లాలోని కోరుట్లలో దారుణ సంఘటన చోటు చేసుకుంది. దొంగలుగా భావించి నలుగురు వ్యక్తులపై స్థానికులు దాడి చేశారు. దాడిలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రికి తరలించే లోపు ఒకరు మృతి చెందగా, మరో ముగ్గరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పిల్లుల వేటకు వెళుతుండగా దొంగలుగా భావించి స్థానికులు దాడి చేశారు. కోరుట్ల పోలీసులు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు మెట్‌పల్లికి చెందిన చిత్తారి సుదర్శన్‌గా గుర్తించారు.

నేటినుంచి ఉత్తరాఖండ్‌లో సభాపతుల భేటీ

హైదరాబాద్,డిసెంబర్16(ఆర్ఎన్ఎ): అఖిల భారత చట్ట సభల అధ్యక్షులు, సభాపతులు, ఉపాధ్యక్షులు, ఉప సభాపతులు, శాసన మండలి కార్యదర్శుల సదస్సు ఈ నెల 17 నుంచి 20 వరకు ఉత్తరాఖండ్ రాజధాని డెహ్రాడూన్‌లో జరగనుంది. ఈ సదస్సులో అన్ని రాష్ట్రాల చట్ట సభల కార్యదర్శులు సమావేశమై చట్ట సభల్లో అమర్యాదగా వాడే పదాల తొలగింపుపై ప్రస్తుత నిబంధనలను సమీక్షించడంతోపాటు చట్ట స

మెరుగుపడ్డ ప్రభుత్వాసుపత్రులు

పెరిగిన వసతులతో అదుబాటులోకి సేవలు : మంత్రి వెల్లడి

తార్నాకలోని జాతీయ పోషకాహార సంస్థ ఎన్ఐఎన్‌లో బాలామృతం ప్లస్ పథకాన్ని ప్రారంభించిన అనంతరం చిన్నారికి అందించిన మహిళా-శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్. చిత్రంలో వైద్యారోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్, యూనిసెఫ్ దక్షిణ రాష్ట్రాల చీఫ్ మిషల్ రస్డియాను కూడా చిత్రంలో చూడవచ్చు.

హైదరాబాద్,డిసెంబర్16(ఆర్ఎన్ఎ): ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య సేవలు మెరుగయ్యాయని మంత్రి ఈటెల రాజేందర్ అభిప్రాయపడ్డారు.

నిధుల కేటాయింపుతో సేవలను విస్తృతం చేస్తున్నామని అన్నారు. ఇటీవల ప్రభుత్వాసుపత్రులకు నిధులు వెచ్చించి సౌకర్యాలు మెరుగు పరిచామని అన్నారు. అన్ని జిల్లా, ఏరియా ఆస్పత్రుల్లో ఎమర్జెన్సీ సేవలు, ఐసీయూలు అందు బాటులోకి తెచ్చామన్నారు. క్రమక్రమంగా ప్రభుత్వ ఆస్పత్రులను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తున్నామని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకానికి ఆటంకాలు లేవని, గత బకాయిలను కూడా చెల్లించి సేవలు అందేలా చేసామని స్పష్టం చేసారు. గత 20 ఏళ్లగా వైద్యుల నియామకం జరగలేదని ఈ దుస్థితికి కారణం కాంగ్రెస్ పార్టీయేనని మంత్రి పేర్కొన్నారు. అలాగే రాష్ట్రంలో ఆరోగ్యశ్రీకి ఎక్కడా ఆటంకం లేదని స్పష్టం చేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా బీద ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఆరోగ్యశ్రీ జాబితాలో 322 ఆస్పత్రులను చేర్చామని స్పష్టం చేశారు. ఆరోగ్యశ్రీలో అదనంగా కొన్ని శస్త్ర చికిత్సలు చేర్చామన్నారు.

ప్రభుత్వాసు పత్రుల్లో ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీలు చేస్తున్నామని ప్రకటించారు. పాత బకాయిలను కూడా చెల్లించామని చెప్పారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ఆస్పత్రులు భ్రష్టు పట్టాయని ధ్వజమెత్తారు. అన్ని ప్రభుత్వాసు పత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాం, మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 20 శాతం రోగులు పెరిగారని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల సేవలకు గానూ జాతీయ స్థాయిలో రాష్ట్రం అవార్డు తీసుకోవడం జరిగిందని గుర్తు చేశారు.

ఏసీబీకి చిక్కిన కర్నూల్ సీఐ

- రూ. 40వేలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

కర్నూలు, డిసెంబర్16(ఆర్ఎన్ఎ) : కర్నూలు సీఐ రామయ్యనాయుడు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వలకు చిక్కాడు. న్యాయవాది చంద్రశేఖర్‌రెడ్డి మధ్యవర్తిత్వం ద్వారా రూ.40 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. వివరాల్లోకి వెళ్తే.. కర్నూలు సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌లో రెండునెలల క్రితం సభ్యులను మోసిగించిన అభియోగంపై నవకాంత్ చిట్‌ఫండ్ సంస్థపై చీటింగ్ కేసు నమోదైంది. ఈ కేసు దర్యాప్తు బాధ్యతలను అధికారులు సీఐ రామయ్యనాయుడుకు అప్పగించారు. ఈ క్రమంలో సంస్థ నిర్వాహకుల్లో ఒకరైన ఆదినారాయణరెడ్డిని అరెస్టు చేయకుండా ఉండేందుకు సీఐ రూ.40 వేలు లంచం డిమాండ్ చేశారు. లంచం ఇచ్చేందుకు ఇష్టపడని ఆదినారాయణరెడ్డి బంధువు శివరామిరెడ్డి.. ఈనెల 13న అనిశా అధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం సీఐ రామయ్యనాయుడు ఇంటి సమీపంలోని ఓ హోటల్ ఆవరణలో న్యాయవాది చంద్రశేఖర్‌రెడ్డి లంచం తీసుకుంటుండగా అనిశా అధికారులు పట్టుకున్నారు. న్యాయవాది చంద్రశేఖర్‌రెడ్డితోపాటు సీఐని కూడా అరెస్టు చేసినట్లు అనిశా డీఎస్పీ నాగభూషణం తెలిపారు. మరోవైపు రామయ్యనాయుడు ఇంట్లోనూ అనిశా అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. అక్రమ ఆస్తులు పట్టుబడితే మరో కేసు నమోదు చేసే అవకాశం ఉంది.

4 నెలల్లోగా అయోధ్యలో రామాలయం: అమిత్ షా

హైదరాబాద్, డిసెంబర్16(ఆర్ఎన్ఎ) : నాలుగు నెలల్లో అయోధ్య రామాలయం ను నిర్మిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్నారు.

సోమవారం జార్ఖండ్‌లోని పాకూర్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. రామాలయం నిర్మాణంపై సుప్రీంకోర్టు ఇప్పటికే తీర్పు చెప్పిందని, మరో నాలుగు నెలల్లో రామాలయంను నిర్మించి తీరుతామని అమిత్‌షా పేర్కొన్నారు. ఆకాశమంత ఎత్తులో రామాలయం నిర్మిస్తాంమన్నారు.

అయోధ్య తీర్పుపై ఇటీవల దాఖలైన అన్ని రివ్యూ పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో అమిత్ షా ఈ డెడ్‌లైన్ ప్రకటించడం గమనార్హం. జార్ఖండ్‌లో కశ్మీర్ గురించి ఎందుకు మాట్లాడుతున్నారని కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారని, ఆర్టికల్ 370 రద్దుతో కశ్మీర్ ఇప్పుడు భారత్‌లో భూభాగంగా మారిందని, భారత్‌లో కశ్మీర్‌ను కలపడం మీకు ఇష్టం లేదా అని షా తన ప్రసంగంలో ప్రశ్నించారు.

అయోధ్య రామమందిరంపై సుప్రీంకో?ర్టు విస్పష్టమైన తీర్పు వెలువరించిన నేపథ్యంలో బీజేపీ మరింత దూకుడు ప్రదర్శిస్తోంది. మరో నాలుగు నెలల్లో అయోధ్యలో రామాలయం నిర్మిస్తామని ఆ పార్టీ సారథి, కేంద్ర హోంమంత్రి సంచలన ప్రకటన చేశారు. అయోధ్య రామ మందిర నిర్మాణానికి అవాంతరాలు సృష్టించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎన్ని ప్రయత్నాలు చేసినా రామాలయం నిర్మించి తీరతామని పేర్కొన్నారు.

చివరి భూముల వరకు నీటి విడుదల

సమగ్ర ప్రణాళిక అమలయ్యేలా చర్యలు

నల్లగొండ,డిసెంబర్16(ఆర్ఎన్ఎ): యాసంగిలో ఎడమకాల్వ పరిధిలోని వివిధ మేజర్ల చివరి భూములు ప్రతి ఎకరాకు సాగునీటిని అందించేలాగా ప్రభుత్వం పకడ్బందీగా ప్రణాళికలు సిద్ధం చేసింది .నాగార్జునసాగర్ ఎడమకాల్వ పరిధిలోని పలు మేజర్లకు ప్రభుత్వం యాసంగిలో టేల్ అండ్ హెడ్ పద్ధతిన నీటి విడుదల చేయనుంది. ఇందుకుగాను సాగర్ ఎడమకాల్వ పరిధిలోని నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో మేజర్ కాల్వల చివరి భూములకు నీరందించేందుకు సంబంధిత జిల్లా కలెక్టర్ల పర్యావేక్షణలో ఎన్ఎస్పీ అధికారులు, రెవెన్యూ అధికారులతో మానిటరింగ్ చేపట్టనున్నారు. నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లో ప్రస్తుతం ఉన్న నీటి లభ్యతను బట్టి ఎడమకాల్వకు ఎప్రిల్ 5వరకు వారబంధి విధానంలో ఎడమకాల్వ ఆయకట్టుకు, ఆరుతడి పంటలకు ప్రభుత్వం 8 విడతలుగా ప్రభుత్వం నీటిని విడుదల చేయనుంది. నల్లగొండ, ఖమ్మం జిల్లాలతోపాటు ఎన్ఎస్పీ స్థాయి అధికారులు, వీఆర్వో, వీఆర్వోల వరకు ఎడమకాల్వ నీటివిడుదల వాడకంపై పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయనున్నారు. సాగర్ ఎడమకాల్వ పరిధిలో ప్రథమమైన రాజవరం మేజర్ మొదలుకొని ఖమ్మం జిల్లా పాలేరు వరకు ఉన్న రాజవరం, సూరేపల్లి, నారేళ్లగూడెం, ముదిమానిక్యం, వజీరాబాద్, జానాపహాడ్ తదితర మేజర్ల కింద టేలాండ్ చివరి భూములకు సాగునీటిని అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుంది. ఈనేపథ్యంలో ఎడమకాల్వ పరిధిలోని మేజర్ల కింద చివరి భూములకు యాసంగిలో సాగునీటిని సక్రమంగా అందించేందుకు ఎన్ఎస్పీ, రెవెన్యూ యంత్రాంగం కృషిచేయాల్సిన అవసరం ఉంది. ఇదిలావుంటే జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖలకు అవసరమయ్యే భూములను సేకరించాలని ఆర్డీఓలు, తహసీల్దార్లకు సూచించారు. సర్వేలో గుర్తించిన ప్రభుత్వం భూములను ల్యాండ్‌బ్యాంక్ కింద నమోదు చేసేలా చూడాలన్నారు. భవిష్యత్లో ఎక్కడ ఏ అవసరమొచ్చినా భూమి వాడుకునే విదంగా దానిని సంరక్షించలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల అవసరాలకు ప్రభుత్వ భూమి అవసరం ఉందని అం దుకు అనుగుణంగా భూములను గుర్తించాలని సూచించారు. కార్యాలయాల నిర్మాణానికి, ఇతర అవసరాలకు ఎంత భూమి అవసరముందో తెలియజేయడం జరిగిందన్నారు. అధికారుల కోరిన మేరకు అందుబాటులో గల భూమిని కేటాయించడం జరుగుతుందని, మిగిలిన భూమిని వివిధ మండలాల్లో గుర్తించాలని సూచించారు. ఇదిలావుంటే డిండి ప్రాజెక్టు పరిధిలోని శివన్నగూడెం, చింతపల్లి, సింగరాజుపల్లి, గొట్టివుక్కల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పరిధిలో ముంపుకు గురవుతున్న గ్రామాల ప్రజలకు ఆర్ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని జేసీ అధికారులకు సూచించారు. ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందజేస్తామని అందుకు తగిన విధంగా అధికారులు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. భూసేకరణపై ప్రగతి నివేదికలపై చర్చించి రిజర్వాయర్ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

చెన్నమనేనికి హైకోర్టులో ఊరట

- మరోసారి స్టే పొడిగించిన న్యాయస్థానం
- ఎనిమిది వారాల పాటు పౌరత్వంపై ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దు
- ఆదేశాలు జారీ చేసిన హైకోర్టు

హైదరాబాద్, డిసెంబర్16(ఆర్ఎన్ఎ) : హైకోర్టులో వేములవాడ టీఆర్ఎస్ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్‌కు ఊరట లభించింది. చెన్నమనేని పౌరసత్వాన్ని కేంద్ర హోం శాఖ రద్దుచేసిన విషయం తెలిసిందే. హోం శాఖ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ చెన్నమనేని హైకోర్టు ఆశ్రయించగా నవంబరు 22న మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. నాలుగు వారాల పాటు కేంద్ర హోం శాఖ ఉత్తర్వులను నిలిపివేయాలని పేర్కొంది. తాజాగా మరోసారి హైకోర్టు స్టే పొడిగింది. ఎనిమిది వారాల పాటు చెన్నమనేని రమేష్ పౌరసత్వంపై ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. చెన్నమనేని పౌరసత్వం కేసు విచారణ సందర్భంగా రమేష్‌కు జర్మనీ, భారతీయ పౌరసత్వం ఉందని పిటిషనర్ పేర్కొన్నారు. అయితే, ఇప్పటికే జర్మనీ పౌరసత్వం రద్దు చేసుకున్నాడని ఆయన తరఫున లాయర్ కోర్టుకు తెలిపాడు. ఈ నేపథ్యంలో రెండు పౌరసత్వాలకు సంబంధించిన ఆధారాలను చూపించాలని పిటీషనర్‌ను హైకోర్టు కోరింది. పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించిన హైకోర్టు.. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. తన పౌరసత్వ విషయంలో కేంద్ర హోం శాఖ జారీ చేసిన ఉత్తర్వులు రాజ్యాంగ, చట్ట విరుద్ధమంటూ రమేశ్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 10(3)ని పరిగణనలోకి తీసుకోవాలని జూన్ 10న హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కేంద్ర హోం శాఖ పట్టించుకోలేదని, ఏదో కంటి తుడుపు చర్యగా పరిశీలించి అనాలోచితంగా నిర్ణయం వెలువరించిందని అన్నారు. రమేష్‌బాబు పౌరనత్వం చెల్లదంటూ 2009లో ఆయనపై పోటీ చేసి ఓడిపోయిన కాంగ్రెస్ నేత ఆది శ్రీనివాస్ గతంలో కేంద్ర హోంశాఖకు ఫిర్యాదుచేశారు. వాస్తవాలను దాచిపెట్టి మోసపూరితంగా చెన్నమనేని రమేశ్ భారతీయ పౌరసత్వం పొందాడని ఆది శ్రీనివాస్ ఆరోపించారు. దీనిపై విచారణ జరిపిన కేంద్ర హోం శాఖ చెన్నమనేని రమేశ్ పౌరసత్వాన్ని రద్దు చేసింది.

సచిన్ రాక కోసం ఎదురుచూస్తున్నా...: గురు ప్రసాద్

చెన్నై, డిసెంబర్ 16: చెన్నైకి చెందిన 45ఏండ్ల గురుప్రసాద్ తన జీవితంలో ఎన్నటికీ మర్చిపోలేని రోజు కోసం ఎదురుచూస్తున్నాడు. ఏకంగా క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తనను కలవబోతున్నందుకు ఆయన ఆనందానికి అవధుల్లేవు. ఇప్పటికే గురు ప్రసాద్ కోసం గూగుల్‌లో బాగానే వెతికిన నెటిజన్లు ఆయన వృత్తి, సచిన్‌కు ఆయనకు మధ్య ఉన్న పరిచయం కోసం ఇంటర్నెట్‌లో విపరీతంగా శోధించారు. 19ఏళ్ల తర్వాత సచిన్ తనను గుర్తు చేసుకొని కలవాలన్న ఆకాంక్షను ట్వీటర్ ద్వారా వ్యక్తం చేయడంపై చెన్నై వాసి గురు ప్రసాద్ సంతోషంలో మునిగిపోయాడు. సచిన్ తన ఇంటికి వస్తే తమిళ సంప్రదాయాలతో గౌరవిస్తానని గురుప్రసాద్ చెబుతున్నాడు.

'ఒక గొప్ప క్రికెటర్ నన్ను కలవాలని కోరుకోవడంతో ఇక్కడి అభిమానులు గ్రేట్ మాస్టర్‌ను దగ్గరి నుంచి కలిసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. చాలా చాలా ఆతృతగా ఉంది. నేను నివసిస్తున్న ప్రాంతంలోని ప్రజలు, నా స్నేహితులు సచిన్‌ను చూసేందుకు ఎప్పుడెప్పుడా అని వేచిచూస్తున్నారు. అందుకే సచిన్.. నాతో ప్రత్యేకంగా సమావేశమై.. మా కుటుంబంతో కొంతసేపు గడపాలని ఆశిస్తున్నా' అని గురుప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం అసిస్టెంట్ స్టాక్‌బ్రోకర్‌గా ఉన్న గురు ప్రసాద్ గతంలో స్టార్‌హోటల్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేశారు.

అసలేం జరిగిందంటే..

అప్పట్లో ఓ టెస్టు కోసం చెన్నైలోని తాజ్ హోటల్‌లో బస చేసినప్పుడు అక్కడ ఓ ఉద్యోగితో తన బ్యాటింగ్‌పై సంభాషణ జరిగిందని, అతడి సూచనల మేరకు ఎల్బోగార్డ్‌ను మార్చుకొని సత్ఫలితాలు పొందానని సచిన్ శనివారం ట్వీట్ చేశాడు. ఆ ఉద్యోగి ఇప్పుడు ఎక్కడున్నాడో తెలుసుకోవాలని ఉందని, అతడిని కనిపెట్టేందుకు సహకరించాలని నెటిజన్లను సైతం కోరిన సంగతి తెలిసిందే. దీంతో తాజ్ హోటల్ యాజమాన్యమే ఆ ఉద్యోగి ఎక్కుడున్నాడో గుర్తించడంతో పాటు.. అప్పటి ఫొటోను కూడా ట్వీట్ చేసింది.

భాగ్యనగరంలో సున్నితమైన జ్యువెల్లరీ కలెక్షన్స్

-ఆవిష్కరించిన వుమ్మిడి బంగారు జ్యువెల్లరీస్

హైదరాబాద్, డిసెంబర్ 16: ఆభరణాల ప్రేమికుల కోసం ప్రముఖ హెయిర్ లూమ్ జ్యువెల్లరీ బ్రాండ్‌గా పేరొందిన వుమ్మిడి బంగారు జ్యువెల్లరీస్ (వీబీజే) సున్నితమైన ఆభరణాల కలెక్షన్స్ అందుబాటులోకి తెచ్చింది.

చెన్నై కేంద్రంగా సేవలందిస్తున్న సంస్థ వుమ్మిడి బంగారు జ్యువెల్లరీస్ అత్యుత్తమ సంస్థగా నిలిచింది. విలాసమైన వస్తువుల కొనుగోలు చేయడానికి ప్రాధాన్యం ఇచ్చే వినియోగదారుల దరికి చేరుకోవడమే లక్ష్యంగా ఆభరణాలు అందుబాటులోకి తీసుకువచ్చింది వుమ్మిడి బంగారు జ్యువెల్లరీస్.

పర్షియన్ ఆర్ట్ అండ్ ఆర్కిటెక్చర్‌తో రూపుదిద్దుకున్న పర్షియానా, దాలియా ఫ్లోరల్ మాస్టర్ పీసెస్, పురాతన కాలం నాటి కిరిగామి, తులిప్ ఫ్లవర్ స్ఫూర్తిగా రూపొందించిన 'తులిప్స్'తోపాటు అరుదుగా రూపుదిద్దుకునే హ్యాండ్ క్రాఫ్ట్ వధువు కలెక్షన్లు, పురాతన ఆభరణాలు, గాజులు, జుంకాలు వినియోగదారులకు వుమ్మిడి బంగారు జ్యువెల్లరీస్‌లో అందుబాటులో ఉన్నాయి. ఈ సందర్భంగా వుమ్మిడి బంగారు జ్యువెల్లరీస్ మేనేజింగ్ పార్టనర్ వుమ్మిడి అమరేంద్రన్ మాట్లాడుతూ 'బంగారు ఆభరణాల క్రయ విక్రయాల కోసం భాగ్య నగర భాగస్వామ్యంతో ప్రయాణం ప్రారంభిస్తున్నందుకు ఆనందంగా ఉంది. శతాబ్ది కాలంగా తమతో భాగస్వామ్యం గల వినియోగదారులకు మరోసారి సేవలందించే అవకాశం లభించినందుకు వారికి విధేయంగా సేవలందిస్తామని తెలియజేస్తున్నాం' అని తెలిపారు. అద్భుతమైన, ఆకర్షణీయమైన ఆభరణాలను తయారు చేయడం కోసం వుమ్మిడి బంగారు జ్యువెల్లరీస్ ఆధ్వర్యంలో క్రియేటివ్ సెంటర్ నిర్వహిస్తున్నారు. ఇందులో మాస్టర్ క్రాఫ్ట్‌మన్ సన్నిహితంగా పని చేస్తూ డిజైన్లు రూపొందించే డిజైనర్లు పని చేస్తారు.

విశ్వనగరం కాదు.. విషాద నగరం

- మూసీనది ప్రక్షాళన హామీని కేసీఆర్ తుంగలో తొక్కారు
- ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నాడు
- బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్
- నమామి మూసీ కార్యక్రమాన్ని ప్రారంభించిన లక్ష్మణ్

హైదరాబాద్, డిసెంబర్16(ఆర్ఎన్ఎ) : హైదరాబాద్‌ను విశ్వనగరంగా చేస్తామని అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్.. విషాద నగరంగా మార్చారని బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్ విమర్శించారు. బాపు ఘాట్ వద్ద 'నమామి మూసీ' కార్యక్రమాన్ని సోమవారం బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ఇచ్చిన 'నమామి గంగే స్ఫూర్తి'తో మూసీ నది ప్రక్షాళనోద్యమానికి శ్రీకారం చుట్టామని వ్యాఖ్యానించారు. మూసీ నదిని శుద్ధి చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. మూసీనదిని ప్రక్షాళన చేస్తామన్న హామీని.. కేసీఆర్ తుంగలో తొక్కారని లక్ష్మణ్ విమర్శించారు. హుస్సేన్ సాగర్ నీటిని కొబ్బరి నీరుగా మారుస్తామన్న కేసీఆర్ మాటలు నీటిమూటలయ్యాయన్నారు. సీఎం కేసీఆర్ ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారని ఘాటుగా వ్యాఖ్యానించారు.

హైదరాబాద్‌కు మంచి నీరందించిన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ కబ్జాకు గురయ్యాయన్నారు. హుస్సేన్ సాగర్ ప్రక్షాళనకు రూ.3వేల కోట్లు కేటాయించిన ప్రభుత్వం.. మూడు రూపాయలు కూడా ఖర్చు చేయలేదని ఆరోపించారు. నదుల ప్రక్షాళనకు 2001లో వాజపేయి సర్కార్ కేటాయించిన నిధులను రాష్ట్ర ప్రభుత్వాలు పక్కదారి పట్టించాయన్నారు. హైదరాబాద్‌ను విశ్వ నగరంగా మార్చుతామన్న కేసీఆర్.. విషాద నగరంగా మార్చారని లక్ష్మణ్ వ్యాఖ్యానించారు. ముడుపులు తీసుకొని పరిశ్రమల వ్యర్థాలను హుస్సేన్ సాగర్‌లో కలుపుతున్నారని ఆరోపించారు. మూసీ నది కబ్జాలను అడ్డుకోవటంలో టీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. తాగు, సాగునీరు అందించే మూసీ దుర్గంధంగా మారటం బాధాకరమన్నారు. మూసీ నది పరివాహక ప్రాంతంలో వండిన కూరగాయలు సైతం విషతుల్యం అయ్యాయన్నారు. మూసీ నదిని సబర్మతి నదిలా శుద్ధి చేస్తామని ట్విట్టర్ పిట్ట కేటీఆర్ ప్రగల్భాలు పలికారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. బాపు ఘాట్ వద్ద సైతం మూసీ దుర్గంధంగా మారటం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమం అనంతరం హుస్సేన్ సాగర్ వద్ద కొబ్బరికాయలు కొట్టి.. మూసీనది ప్రక్షాళనపై ప్రభుత్వ వైఖరికి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజాసింగ్, బీజేపీ నాయకులు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, డి.కె. అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఇది పిరికి పంద ప్రభుత్వం : ప్రియాంక

న్యూఢిలీ, డిసెంబర్ 16 : పౌరసత్వ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఢిల్లీలోని జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీ విద్యార్థులు చేపట్టిన నిరసన హింసాత్మకంగా మారిన విషయం విదితమే. విద్యార్థుల నిరసన నిప్పును రాజేసింది. యూనివర్సిటీలో నిన్న జరిగిన ఘటనలపై కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ ట్విట్టర్‌లో స్పందించారు. భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం పిరికి పంద ప్రభుత్వం అని ఆమె విమర్శించారు. యూనివర్సిటీలోకి పోలీసులు ప్రవేశించి విద్యార్థులపై దాడి చేయడం దారుణమన్నారు. ఉద్రిక్తల సమయంలో ప్రభుత్వం.. ప్రజల బాధలను వినాల్సిన అవసరం ఉంది. కానీ దాడులు చేయడం సరికాదన్నారు. ఈశాన్య రాష్ట్రాలతో పాటు ఉత్తరప్రదేశ్, ఢిల్లీలోని విద్యార్థులను, జర్నలిస్టులను బీజేపీ ప్రభుత్వం అణిచివేస్తోందని ప్రియాంక ధ్వజమెత్తారు. యువత గొంతును అణిచివేయలేమని మోదీకి వార్నింగ్ ఇచ్చారు ప్రియాంక. ప్రజా గొంతుకను చూసి బీజేపీ ప్రభుత్వం భయపడుతుందన్నారు. ఈ ప్రభుత్వం యువతను నియంతృత్వంతో అణిచివేయాలని చూస్తుందని ప్రియాంక గాంధీ పేర్కొన్నారు.

ఉన్నావ్ అత్యాచార కేసులో..

ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ దోషే!

- సంచలన తీర్పు ప్రకటించిన ఢిల్లీ కోర్టు
- 19న శిక్షను ఖరారు చేయనున్నట్లు తెలిపిన ధర్మాసనం

న్యూఢిల్లీ, డిసెంబర్ 16(ఆర్ఎన్ఎ) : ఉన్నావ్ అత్యాచారం కేసులో ఢిల్లీ కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. ఈ కేసులో ప్రధాని నిందితుడిగా ఉన్న బీజేపీ ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగార్‌ను దోషిగా నిర్ధారించింది. ఈనెల 19న శిక్ష విధిస్తామని న్యాయస్థానం స్పష్టం చేసింది. సోమవారం ఈమేరకు తీర్పును వెల్లడించింది. రెండేళ్ల కిందట బాధితురాలికి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ఆమెపై అత్యాచారానికి పాల్పడిన సెంగార్‌ను ఢిల్లీ తీస్ హజార్ కోర్టు దోషిగా తేల్చింది. ఈ కేసులో ఆగస్టు 9న ఎమ్మెల్యే సెంగార్‌పై సీబీఐ ఛార్జ్‌షీటు దాఖలు చేయడంతో బీజేపీ ఆయనను పార్టీ నుంచి బహిష్కరించింది. 2017లో జరిగిన అత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి యువతిపై ఎమ్మెల్యే సెంగార్ అత్యాచారానికి పాల్పడటంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసిన యూపీ పోలీసులు.. ప్రధాన నిందితుడిగా బీజేపీ ఎమ్మెల్యే కుల్‌దీప్ సింగ్ సెంగర్ పేరును చేర్చారు. తర్వాత జరిగిన పరిణామాలతో కేసును సీబీఐకి అప్పగించారు. లక్నో కోర్టులో విచారణ కొనసాగుతుండగా బాధితురాలిపై హత్యాయత్నం జరిగింది. ఈ ఘటనలో ఆమె బంధువులు ప్రాణాలు కోల్పోగా, బాధితురాలు ఆమె తరఫున లాయర్ తీవ్రగాయాలతో బయటపడ్డారు. ఈ పరిణామాల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సర్వోన్నత న్యాయస్థానం.. కేసు ఢిల్లీ కోర్టుకు బదిలీ చేసింది. ఆగస్టు 5 నుంచి రోజువారీ విచారణ జరిపిన ఢిల్లీ జడ్జ్ ధర్మేష్ శర్మ సోమవారం తీర్పును వెలువరించారు. 45 రోజుల్లోగా కేసు విచారణ పూర్తిచేయాలని సుప్రీం ఆదేశించింది. బాధిత యువతి జులై 28న రాయబరేలిలో జైల్లో ఉన్న తన బంధువును కలవడానికి వెళ్లి తిరిగొస్తుండగా ఆమె ప్రయాణిస్తున్న కారును ఓ భారీ ట్రక్కు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె బంధువులిద్దరు చనిపోయారు. తనపై జరిగిన హత్యాయత్నంగా బాధితురాలు ఆరోపించగా, ఎమ్మెల్యే, అతని సోదరుడు అతుల్ సహా మరో 9 మందిపై చార్జ్‌షీట్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. బాధితురాలు లేఖతో స్పందించిన నాటి చీఫ్ జస్టిస్ రంజన్ గొగొయ్.. ఉన్నావ్ అత్యాచారానికి సంబంధించిన ఐదు కేసులను లక్నో కోర్టు నుంచి ఢిల్లీకి బదిలీ చేయాలని ఆదేశించారు. రోజూవారి వాదనలు విని... 45 రోజుల్లో తుదితీర్పు వెలువరించాలని ఆదేశించింది.

రాష్ట్రపతి పర్యటన.. అధికారులతో సీఎస్ ఎస్‌కే జోషి భేటీ

హైదరాబాద్, డిసెంబర్ 16: ఈ నెల 20 నుంచి 28వ తేదీ వరకు శీతాకాల విడిది కోసం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ హైదరాబాద్‌కు రానున్నారు. ఈ నేపథ్యంలో వివిధ శాఖల అధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి సమీక్ష నిర్వహించారు. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో రాష్ట్రపతి బస చేయనున్నారు. రాష్ట్రపతి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను సీఎస్ ఆదేశించారు. కార్యాచరణ ప్రణాళిక రూపొందించి సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ నెల 20 మధ్యాహ్నం ఒంటిగంటకు రాష్ట్రపతి రామ్‌నాథ్ హైదరాబాద్‌కు చేరుకుంటారని సీఎస్ వెల్లడించారు. 23న రాష్ట్రపతి తిరువనంతపురం వెళ్తారు. 26న సాయంత్రం తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు. ఈ నెల 27న రాష్ట్రపతి నిలయంలో ఎట్‌హోం కార్యక్రమం ఉంటుంది. ఈ నెల 28న మధ్యాహ్నం రాష్ట్రపతి రామ్‌నాథ్ ఢిల్లీకి వెళ్తారు అని సీఎస్ ఎస్‌కే జోషి తెలిపారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.